ప్రజాశక్తి
శనివారం 18 నవంబర్ 2023   8 పేజీలు

గుంటూరు

పల్నాడు

మిర్చిని వెంటాడుతున్న తెగుళ్లు

- బొబ్బర, కొమ్మకుళ్లు ప్రభావంతో రైతుల్లో ఆందోళన
- పైరును కాపాడుకోలేక దున్నేస్తున్న దైన్యం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి



బొబ్బర తెగులు సోకిన మిర్చిపైరు... పైరుకు సోకిన తామర పురుగు (ఇన్‌సెట్)

మిర్చి పైరుపై తెగుళ్ల దాడి పెరిగింది. నల్ల తామర పురుగు, జెమిని వైరస్ (బొబ్బర) ఉధృతం అవుతోంది. పల్నాడు, గుంటూరు జిల్లాలోని వివిధ మండలాల్లో తామర తెగులు గత నెలలోనే స్వల్పంగా ప్రారంభమైంది. ప్రధానంగా పల్నాడు జిల్లాలోని మాచర్ల, గురజాల, సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లో ఈ ప్రభావం ఎక్కువగా ఉంటోంది. తామర పురుగులను ఉద్యాన శాఖ అధికారులు గుర్తించారు. బొబ్బర తెగులు ప్రభావంతో ఆకు ముడత వస్తోంది. కొన్ని ప్రాంతాల్లో కొమ్మకుళ్ల తెగులు ఆశిస్తోంది. మిర్చి పంట జులై, ఆగస్టు నెలల్లోనే సాగు చేసిన ప్రాంతాల్లో తెగులు ప్రభావం ఎక్కువగా ఉంది. తెగులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఇక పైరు నిలబడదని గ్రహించి రైతులు పైరు మొత్తాన్ని దున్నేస్తున్నారు.

ప్రస్తుతం వాణిజ్య పంటల్లో మిర్చికి బాగా గిరాకి ఉంది. నాలుగేళ్లుగా క్వింటాళ్‌కు రూ.15 వేల వరకు లభిస్తుండటంతో ఎన్ని ఇబ్బందులెదురైనా మిర్చి సాగుకు రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. ఎంత ఇబ్బంది వచ్చినా ఎకరాకు 10 క్వింటాళ్లు తగ్గకుండా వస్తుంది. అన్ని పరిస్థితులు అనుకూలిస్తే 20 నుంచి 30 క్వింటాళ్ల కూడా సాధిస్తున్నారు. అయితే ఈ ఏడాది సాగు ఆరంభం నుంచి రైతులకు ఇబ్బందులు ఎదురవుతూనే ఉన్నాయి. మిర్చి మొక్కకు రూ.2 నుంచి రూ.3కు కొనుగోలు చేశారు. ప్రస్తుతం తొలి దశలో సాగు చేసిన ప్రాంతాల్లో పంట పూత, కాయదశల్లో ఉంది. ఈ నేపథ్యంలో తెగుళ్లు వెంటాడుతున్నాయి. ప్రధానంగా ఆకుముడత, బొబ్బర, కొమ్మకుళ్లు ఆశించి ఆకులన్నీ తినేస్తున్నాయి. చీడపీడల నివారణకు ఒక్కో ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు ▶ 2లో

సమావేశంలో మాట్లాడుతున్న గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

రబీలో సాగునీటి సరఫరా ఉండదు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రస్తుత వర్షాభావ పరిస్థితులు, రిజర్వాయర్లలో నీటి నిల్వలు తగినంతగా లేని కారణంగా రబీలో సాగునీటి సరఫరా ఉండదని, నీటి అవసరం తక్కువగా వుండే పప్పుధాన్య రకాలైన మినుము, పెసర పంటలనే సాగు చేసుకోవాలని జిల్లాలోని రైతులను కోరుతూ జిల్లా నీటి పారుదల సలహా మండలి సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి వెల్లడించారు. కలక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన జిల్లా నీటి పారుదల సలహా మండలి, వ్యవసాయ సలహామండలి ప్రత్యేక సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 10.20 టీఎంసీలు, నాగార్జున సాగర్ ప్రాజెక్టులో 26.13 టీఎంసీలు, పులిచింతల ప్రాజెక్టులో 10.29 టీఎంసీలు మాత్రమే వినియోగించుకోవడానికి అందుబాటులో ఉన్నాయని, వీటిని తాగునీటి అవసరాలకే వినియోగించనున్నామని చెప్పారు. అందువల్ల రబీలో నాగార్జున సాగర్ ఆయకట్టుకు, కష్ణా పశ్చిమ డెల్టా ఆయకట్టుకు సాగునీరు సరఫరా చేయబోమని ఇరిగేషన్ అధికారులు తెలిపారని చెప్పారు. జిల్లాలో నాగార్జున సాగర్ ఆయకట్టు ప్రాంత రైతులు నీటి అవసరం లేని శనగ, మినుములు కృష్ణా పశ్చిమ డెల్టా ఆయకట్టు రైతులు మినుము, పెసర వంటి పంటలను మాత్రమే సాగు చేసుకోవాలన్నారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులు, రిజర్వాయర్లలో నీటి లభ్యతపై రైతు భరోసా కేంద్రాల స్థాయి, మండల స్థాయిలోనూ వారంలోపు రైతులతో ప్రత్యేకంగా వ్యవసాయ, ఇరిగేషన్ అధికారులు సమావేశాలు నిర్వహించి రబీలో నీటి అవసరం లేని పంటల సాగుపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేలా చర్యలు ▶ 2లో

సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య

27, 28 తేదీల్లో మహాధర్నా

విజయవాడకు కార్మికులు, కర్షకులు, అన్ని రంగాల ప్రజలు తరలిరావాలని సంఘాలు పిలుపు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

విజయవాడలో ఈనెల 27, 28 తేదీల్లో నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు సన్నాహక సమావేశం నరసరావుపేటలోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. కృష్ణయ్య మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక కార్మికుల హక్కులకు సంకెళ్లు వేస్తున్నారని, పోరాడి సాధించుకున్న హక్కులను రద్దు చేసి 4 లేబర్ కోడ్‌లు తెచ్చిందని విమర్శించారు. రాజ్యాంగాన్నీ తుంగలో తొక్కుతోందని, వ్యవసాయాన్ని కార్పొరేట్ల పరం చేయడానికి పూనుకుందని మండిపడ్డారు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని ప్రధాని మోడీ గతంలో ప్రకటించారని, అయితే మోడీ పాలనలో 4 లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, రైతులు ప్రతిఏటా రూ.2 లక్షల కోట్లు నష్టపోతున్నారని చెప్పారు. అన్ని రంగాల్లో ▶ 2లో

రూ.869 కోట్లతో జెడ్పీ బడ్జెట్

- 2024-25 అంచనా బడ్జెట్‌కు జెడ్పీ స్థాయిసంఘం ఆమోదం
- ఉపాధ్యాయుల సస్పెన్షన్లు ఆపాలి : ఎమ్మెల్సీ కెఎస్
- కేటాయింపులు, బిల్లుల జాప్యంపై సభ్యులు ఆవేదన

సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీచైర్‌పర్సన్ హెనీక్రిస్టినా

ప్రజాశక్తి-గుంటూరు

ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజాపరిషత్‌కు 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌కు జెడ్పీ స్థాయి సంఘం ఆమోదం తెలిపింది. శుక్రవారం జెడ్పీ స్థాయి సంఘ సమావేశాలు జరిగాయి. జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన జరిగిన 1వ స్థాయి సంఘ సమావేశంలో ప్రస్తుత సవరణ బడ్జెట్, వచ్చే ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ అంచనాలను ఆమోదించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం కంటే వచ్చే ఆర్థిక సంవత్సరంలో దాదాపు రూ.32.24 కోట్లు రాబడులు పెరుగుతాయని అంచనా వేశారు. దీనిని తర్వాత జరిగే జెడ్పీ సర్వసభ్య సమావేశంలో ఆమోదానికి ప్రతిపాదిస్తారు. ఆమోదిత బడ్జెట్‌లో వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రాబడులు రూ.869 కోట్ల ఒక లక్ష, 53 వేలు, ఖర్చులు రూ.828 కోట్ల 83 లక్షల 42 వేలుగా, మిగులు బడ్జెట్ కింద రూ.40 కోట్ల 18 లక్షల 11 వేలుగా అంచనా వేశారు. కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2023-24కు సంబంధించిన సవరణ బడ్జెట్‌లో రాబడులు రూ.836 కోట్ల 76 లక్షల 78 వేల 407గాను, ఖర్చులు రూ.811 కోట్ల 50 లక్షల, 58 వేల 340లుగా, మిగులు బడ్జెట్ రూ.25 కోట్ల 26 లక్షల 20 వేల 67లుగా చూపించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ శాఖ నుండి స్టాంప్ డ్యూటీ సర్‌చార్జీ కింద జెడ్పీకి రావాల్సిన రూ.2.5 కోట్లు విడుదల చేసినందుకుగాను రిజిస్ట్రేషన్ శాఖ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

ఉపాధ్యాయుల సస్పెన్షన్లు అన్యాయం : ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ఇటీవల కాలంలో చిన్న చిన్న కారణాలతో ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల్ని సస్పెన్షన్లు చేస్తున్నారని, ఇది సరికాదని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. దీని వల్ల మిగిలిన ఉపాధ్యాయుల్లో ఆసక్తి సన్నగిల్లుతుందని, అభద్రతా భావం వస్తుందని చెప్పారు. పాఠశాల విద్య ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రవీణ్ ప్రకాష్ పాఠశాలలు తనిఖీ చేస్తున్నారని, వర్క్‌బుక్స్ ఇవ్వలేదని, పిల్లలు రాయలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని, ఆ మరునాడే జిల్లా అధికారులు ఉపాధ్యాయుల్ని సస్పెండ్ చేస్తున్నారని ఉదహరించారు. మరోవైపు ప్రిన్సిపల్ సెక్రెటరీ ఉపాధ్యాయుల్ని సస్పెండ్ చేయొద్దని అధికారులకు సంక్షిప్త సందేశాలు పంపుతున్నారన్నారు. రెండ్రోజుల క్రితం గుంటూరు రూరల్ మండలం, జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం సస్పెన్షన్ అన్యాయమన్నారు. సస్పెన్షన్‌ను ▶ 2లో

వడ్డెరలను అవమానించడం తగదు

ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

కులం పేరుతో గుణాన్ని వక్రీకరిస్తూ శ్రీసత్యసాయి జిల్లా టిడిపి అధ్యక్షులు బీకే పార్థసారథి చేసిన వ్యాఖ్యలు తీవ్ర మనోవేదనకు గురి చేశాయని ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం అన్నారు. శుక్రవారం సాయంత్రం తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ పుట్టపర్తి నియోజకవర్గ టిడిపి, జనసేన సమన్వయ సమావేశంలో బీకే పార్థసారథి వడ్డెర కులస్తులపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఉపసంహరించుకుని క్షమాపణ చెప్పాలన్నారు. రాజ్యాధికారంలో భాగంగా వడ్డెర జాతి ప్రజలకు అన్నిస్థాయిల్లోనూ వైసిపి అవకాశాలు కల్పించిందని గణాంకాలను వివరించారు. నమ్మిన వారి కోసం ప్రాణాలు ఇచ్చే వడ్డెర జాతి ప్రజలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతోనే కొనసాగాలని, వడ్డెర జాతి ప్రజలను అవమానిస్తున్న తెలుగుదేశం పార్టీని విడాలని కోరారు.

మాట్లాడుతున్న కేంద్ర ప్రభుత్వ సంయుక్త కార్యదర్శి సాలోమన్ ఆరోక్యరాజ్

కేంద్ర ప్రభుత్వ పథకాలపై సంకల్పయాత్ర

ప్రజాశక్తి-గుంటూరు

కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించే లక్ష్యంతో జరుగుతున్న వికసిత్ భారత్ సంకల్పయాత్ర జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సక్రమంగా నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వ సంయుక్త కార్యదర్శి, జిల్లా ప్రభరీ అధికారి సాలోమన్ ఆరోక్యరాజ్ అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో సాలోమన్ ఆరోక్యరాజ్, జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి, సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారితో కలసి పాల్గొన్నారు. జిల్లాలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహణకు సంబంధించి జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజేంటేషన్ ద్వారా వివరిస్తు జిల్లాలో 258 గ్రామాల్లో 60 రోజుల్లో, గుంటూరు , తాడేపల్లి మంగళగిరి నగరపాలక సంస్థలతో పాటు తెనాలి, పొన్నూరు మున్సిపాల్టీలలో 40 ప్రాంతాల్లో 20 రోజుల్లో సంకల్ప యాత్రను జిల్లాకు కేటాయించిన రెండు ప్రచార వాహనాలు ద్వారా కార్యక్రమాలు నిర్వహించేలా షెడ్యూల్, రూట్ మ్యాప్ రూపొందించామన్నారు. కేంద్ర ప్రభుత్వం 17 పథకాలకు సంబంధిత శాఖ జిల్లా స్థాయి అధికారిని నోడల్ ఆఫీసర్ గా నియమించటం జరిగిందన్నారు.జనవరి 26 వరకూ ఈ యాత్ర నిర్వహించాలని సాలోమన్ఆరోక్యరాజ్ పేర్కొన్నారు. సమావేశంలో డిఆర్ఒ కె.చంద్రశేఖర్‌రావు, జెడ్పీ సిఇఒ జె.మోహనరావు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నందివెలుగు, ముట్లూరు రూట్లలో ఆర్టీసీ గిఫ్ట్ స్కీమ్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు -తెనాలి వయా నందివెలుగు, గుంటూరు - ముట్లూరు రూట్‌లలో గిఫ్ట్ స్కీం ప్రవేశపెట్టినట్లు ఆర్టీసి గుంటూరు -2 డిపో మేనేజర్ షేక్ అబ్దుల్ సలామ్ ఒక ప్రకటనలో తెలియజేశారు. గుంటూరు నందివెలుగు రూట్‌లో ప్రయాణించే మున్నంగి, వల్లభాపురం, హనుమాన్ పాలెం, కొల్లిపర, తెనాలి ప్రయాణీకులు, అదే విధంగా గుంటూరు-ముట్లూరు రూట్‌లో ప్రయాణించే బుడంపాడు,నారా కోడూరు, చేబ్రోలు, రెడ్డిపాలెం, ముట్లూరు ప్రయణీకులు తమ జర్నీ పూర్తి అయిన తరువాత తమ టికెట్ వెనుక భాగంలో తమ పేరు, సెల్ నెంబర్ రాసి బస్‌లో వున్న గిఫ్ట్ స్కీం బాక్స్‌లో వేయాలన్నారు.వారిలో ఇద్దరు విజేతలను డ్రా ద్వారా ఎంపిక చేసి, ప్రతి నెలా 16వ తేదీ, 1వ తేదీన బహుమతులు అందచేస్తామని చెప్పారు. నందివెలుగు రూట్‌లో నాలుగు బస్సులు, ముట్లూరు రూట్‌లో రెండు బస్సులు తిరుగుతున్నాయని, ప్రయాణికులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరారు.

మహనీయుల ఆశయాలను సాధించడమే వారికి నివాళి

సిపిఎం ఆధ్వర్యంలో శంకరయ్య, బాసుదేవ్ ఆచార్య సంతాప సభ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మహనీయుల ఆశయాలను సాధించడమే వారికిచ్చే నివాళి అని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య అన్నారు. ఇటీవల మృతి చెందిన తమిళనాడు రాష్ట్రానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు, సిపిఎం నేత శంకరయ్య, పశ్చిమ బెంగాల్‌కు చెందిన సీనియర్ పార్లమెంటేరియన్ బాసుదేవ్ ఆచార్యల సంతాప సభ నరసరావుపేటలోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం నిర్వహించారు. సభకు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు అధ్యక్షత వహించగా శంకరయ్య, బాసుదేవ్ ఆచార్య చిత్రపటాలకు కృష్ణయ్యతోపాటు సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్, కార్యదర్శివర్గ సభ్యులు వై.రాధాకృష్ణ పూలమాలవేసి నివాళులర్పించారు. కృష్ణయ్య మాట్లాడుతూ శంకరయ్య రైతు సంఘం బలోపేతానికి చేసిన కృషి ఎనలేనిదన్నారు. అన్ని పోరాటాల్లో స్ఫూర్తిదాయకంగా ఉన్నారని కొనియాడారు. కార్మిక వర్గం తరపున చేసిన పోరాటాలలో 8 ఏళ్ల పాటు జైలు శిక్ష అనుభవించారని గుర్తు చేశారు. విజయకుమార్ మాట్లాడుతూ శంకరయ్య, బాసుదేవ్ ఆచార్య జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శనీయమన్నారు. బాసుదేవ్ ఆచార్య విద్యార్థి దశలోనే విద్యార్థి నాయకుడిగా, తర్వాత కార్మిక నాయకుడిగా గ్రామీణ, గిరిజన సంఘం ఉద్యమంలో, పశ్చిమ బెంగాల్ రైల్వే కాంట్రాక్ట్ లేబర్ యూనియన్, ఎల్ఐసి ఏజెంట్స్ తదితర కార్మిక యూనియన్ల అధ్యక్షుడిగా కొనసాగారన్నారు. ఎర్రజెండాకు, కార్మిక వర్గానికి ఆయన అంకితమైనతీరు గొప్పదని కొనియాడారు. సభలో సిపిఎం నాయకులు ఎ.లక్ష్మీశ్వరరెడ్డి, జి.రవిబాబు, డి.శివకుమారి, హనుమంతరావు, సిలార్ మసూద్, టి.శ్రీను, బాలకృష్ణ, రాజ్‌కుమార్, హనుమంతరెడ్డి, మహేష్ పాల్గొన్నారు.

కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులు

జిల్లా గ్రంథాలయంలో కవి సమ్మేళనం

ప్రజాశక్తి-గుంటూరు : అరండల్‌పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా శుక్రవారం 4వ రోజు కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ కవి సమ్మేళనాన్ని గుంటూరు జిల్లా రచయితల సంఘం కార్యదర్శి ఎస్.ఎం.సుభాని నిర్వహించారు. కవయిత్రులు, కవులు డాక్టర్ యం.లలిత కుమారి, షేక్ ఖాసింబి, పి. విజయశ్రీ, టి.పద్మావతి, యక్కంటి పద్మావతి, పి.భాగ్యలక్ష్మి, షేక్ బషీరున్నిసా బేగం, పి.దుర్గ, బి.జమదగ్ని, కొణతం నాగేశ్వరరావు, ఎ.వి.కె.సుజాత, జి.నాసరయ్య పాల్గొని ప్రస్తుతం జరుగుతున్న వివిధ అంశాలపై కవితలను వినిపించారు. అనంతరం వివిధ స్కూలు విద్యార్థులకు గ్రంథాలయాల ప్రాముఖ్యతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె. ఝాన్సీలక్ష్మి, సీనియర్ సహాయకులు యం.సీతారామయ్య, గ్రంథపాలకులు చిన్నపరెడ్డి, యన్.నాగిరెడ్డి, ఐ.వి.దుర్గారెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాంతీయ గ్రంథాలయంలో వ్యాసరచన పోటీలు..

ఏసీ కాలేజి ఎదురుగా ఉన్న ప్రాంతీయ గ్రంథాలయంలో 'విద్యార్థులు-పఠనాసక్తి పెంపొందించుకోవటం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించగా విద్యార్థులు పెద్ద సంక్యలో పాల్గొన్నారు.

గుడివాడలో టిడిపి, జనసేన ప్రచారం

ప్రజాశక్తి - తెనాలి : మండల పరిధిలోని గుడివాడలో టిడిపి, జనసేన పార్టీలు సంయుక్తంగా చేపట్టిన భవిష్యత్తుకు గ్యారంటీ, ఓటర్ జాబితా పరిశీలన కార్యక్రమం శుక్రవారం జరిగింది. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, జనసేన పిఎసి చైర్మన్ నాదెండ్ల మనోహర్ ఆ పార్టీ నాయకులతో కలిసి పర్యటించారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించిన వారిపై బలవంతంగా కేసులలో ఇరికించడం, వేధింపులకు గురి చేయడం వంటి అంశాలను ప్రధానంగా ప్రస్తావించి వైసిపి పాలనకు చరమగీతం పాడాలని

పిలుపునిచ్చారు. ఎం.దానియేలు, కె.కోటేశ్వరరావు, హెచ్.గౌరీశంకర్, జాకీర్, వై.అనిత పాల్గొన్నారు

సమవేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

రూ.869 కోట్లతో జెడ్పీ బడ్జెట్

(మొదటి పేజీ తరువాయి)

తక్షణమే రద్దు చేయకుంటే ఆందోళనలు తప్పవని స్పష్టం చేశారు. ఉపాధ్యాయుల సమస్యలపై విన్నవించేందుకు ఆర్‌జెడి కార్యాలయంలో అందుబాటులో ఉండట్లేదని మండిపడ్డారు. గుంటూరులో ఆర్‌జెడి కార్యాలయం ఉన్నా ఎప్పుడూ ప్రకాశం జిల్లాలోనే ఉంటున్నారని, సమస్యలు ఎలా విన్నవించాలని ప్రశ్నించారు. జెడ్పీ సమావేశాలకు సైతం ఏదో ఒక కారణంతో జిల్లా విద్యాశాఖ అధికారులు గైర్హాజరు అవుతున్నారని అసహనం వ్యక్తం చేశారు. కాకుమాను బాలికల గురుకుల పాఠశాలకు తాగునీటి వసతికి 9 నెలల క్రితం నిధులు మంజూరైనా పనులింకా ప్రారంభించకపోవటం సరికాదన్నారు. జెడ్పీ నుండి పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ త్వరితగతిన అందచేయాలని జెడ్పీ చైర్‌పర్సన్‌ను లక్ష్మణరావు కోరారు.

బిల్లులు, కేటాయింపులపై సభ్యుల అసంతృప్తి

మండలాలకు కేటాయింపులు, చేసిన పనులకు సంబంధించి బిల్లులు విడుదల కాకపోటంపై పలువురు జెడ్పీటిసి సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. నర్సరావుపేటలో జెడ్పీటీసీ గది నిర్మాణానికి అనుమతులు మంజూరు చేసి, నిర్మాణం పూర్తి చేసిన తర్వాత నిధులు మాత్రం ఇవ్వట్లేదని జెడ్పీటీసీ అన్నారు. ఈపూరు మండలంలో జగనన్న కాలనీలకు రోడ్లు వేసిన బిల్లులు నాలుగేళ్ల నుండి విడుదల కాలేదని, దీంతో అప్పులు చెల్లించడానికి పొలాలు అమ్ముకోవాల్సి వస్తోందని ఈపూరు జెడ్పీటీసీ ఆవేదన వ్యక్తం చేశారు. రూ.25 లక్షల పనులకు ప్రతిపాదనలు ఇస్తే కేవలం రూ.10 లక్షలకే మంజూరు చేశారని, దీంతో అనేకచోట్ల రోడ్లు మధ్యలో నిలిచిపోయాయని కాకుమాను జెడ్పీటీసీ గుల్జార్‌బేగం ఆవేదన వెలిబుచ్చారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఉన్న నిధులనే అందరికీ సమానంగా ఇస్తున్నామని చెప్పారు. సచివాలయాల్లో సిబ్బంది అందుబాటులో ఉండట్లేదని, కొన్నిచోట్ల కొరత ఉందని ఈ సమస్యను పరిష్కరించాలని గుంటూరు జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు కోరారు.

మిర్చిని వెంటాడుతున్న తెగుళ్లు

(మొదటి పేజీ తరువాయి)

పురుగు మందులను వినియోగిస్తున్నారు.

పెదకూరపాడు ప్రాంతంలోని లింగంగుంట్లలో కొంత మంది రైతులు తెగుళ్ల బారిన పడిన పంటను దున్నేశారు. అయితే సస్య రక్షణ చర్యలు చేపట్టాలని, మిర్చికి అనుబంధంగా జొన్న, మొక్క, జొన్న పైర్లు వేస్తే తెగుళ్ల బెడద నుంచి మిర్చి పైరును కాపాడుకోవచ్చునని వ్యవసాయ, ఉద్యాన శాఖాధికారులు చెబుతున్నారు. ప్రతి ఏటా మిర్చిపై బొబ్బర తెగుళ్ల వస్తున్నా శాస్త్రవేత్తలు శాశ్వత నివారణకు సూచనలు చేయలేకపోతున్నారు. మిర్చి పక్కన మరో పంట వేసుకోవాలనే సూచిస్తున్నారు. వ్యవసాయ, ఉద్యాన విశ్వవిద్యాలయాల శాస్త్రవేత్తలు కూడా తెగుళ్ల నివారణకు శాశ్వత పరిష్కారం కనుగొనలేకపోయారు.

మార్కెట్‌లో మిర్చి ధరలు ఆశాజనకంగా ఉండటం వల్ల వర్షాభావ పరిస్థితులు ఎదురవుతున్నా రైతులు ఎక్కువ రోజులు వేచిచూసే ధోరణిలో ఉన్నా చివరికి ఖరీఫ్ సీజన్ దాదాపుగా ముగింపు దశలో మిర్చివైపు మొగ్గు చూపారు. మిర్చికి ఎకరాకు కనీసం రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టాల్సి వస్తుంది. తెగుళ్ల ప్రభావం అధికమైతే మరో రూ.50 వేలు అదనంగా ఖర్చు అవుతుంది. బొబ్బర, ఆకుముడత, తెల్లదోమ, తామర పురుగుల ఉధృతి తగ్గించడానికి ఎకరానికి జిగురు రాసిన పసుపు, నీలిరంగు అట్టలను 30 నుంచి 40 అట్టలను పెట్టుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. బొబ్బర, తామర తెగులు నివారణకు వేప నూనె వినియోగించాలన్నారు. అదేవిధంగా 10 రోజులకు వేప నూనెకు బదులు గానుగ నూనెను కలిపి పొలానికి పిచికారి చేయాలన్నారు. ఇందువల్ల రసంపీల్చే, లద్దె పురుగు లార్వా కొసస్థ దశలు కుడా నివారించవచ్చుని చెబుతున్నారు.

రబీలో సాగునీటి సరఫరా ఉండదు

(మొదటి పేజీ తరువాయి)

తీసుకోవాలని ఆదేశించారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వరి కోతలు ముగిసే సమయానికంటే ముందుగానే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని పౌర సరఫరాల శాఖాధికారులను కలెక్టర్ ఆదేశించారు. అధిక ధరలకు విత్తనాలను వ్యాపారులు విక్రయించడకుండా వ్యవసాయ శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ ఎన్.శివరామకృష్ణ మాట్లాడుతూ రబీలో నీటి అవసరం లేని మినుము, పెసర పంటలలో మేలు రకాలను రైతులకు సిఫార్సు చేయడంతో పాటు అవసరమైన విత్తనాలను రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో వుంచేలా వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎన్.వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ ఎస్ఇ ఉమామహేశ్వరరావు, ఏపీఎంఐపీ ప్రాజెక్టు మేనేజర్ వజ్రశ్రీ, జిల్లా ఉద్యానశాఖాధికారి రవీందర్, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజరు జి.లక్ష్మీ, ఏపీ సీడ్స్ జిల్లా మేనేజర్ సుబ్బయ్య, ఆత్మ డీడీ రామాంజనేయులు పాల్గొన్నారు.

27, 28 తేదీల్లో మహాధర్నా

(మొదటి పేజీ తరువాయి)

విఫలమవడంతోపాటు ప్రజావ్యతిరేక విధానాలను అమలు చేస్తున్న బిజెపిని గద్దె దింపేందుకు కార్మికులు, కర్షకులు, అన్ని రంగాల ప్రజలు ఐక్యం కావాలని పిలుపునిచ్చారు.

కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ మాట్లాడుతూ సాగుదార్లలో ఎక్కువమంది కౌలురైతులే అయినా వారికి గుర్తింపు, భరోసా ఏమీ లేదన్నారు. కౌలు రైతులకు సమగ్ర చట్టాన్ని తెవాలని డిమాండ్ చేశారు. పంట చేతికి వచ్చే సమయానికి ధరలు తగ్గిపోతున్నాయని, సిపిఐ కేంద్రాల ద్వారా పత్తి కొనుగోలుకు, మార్క్‌ఫెడ్ ద్వారా వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలుకు చర్యలు చేపట్టాలన్నారు. పంటలకు అదనంగా బోనస్ ఇచ్చి ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సాగునీటి వసతి, వర్షాధారం అనే తేడా లేకుండా అన్ని పంటలనూ వర్షాధార పంటలుగానే పరిగణించి నష్టపరిహారం, బీమా పరిహారం అందించాలని కోరారు. పల్నాడు జిల్లాలో ప్రధాన వాణిజ్య పంటలైన పత్తి, మిర్చి, మొక్కజొన్న సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారని గుర్తుచేశారు. కౌలు రైతులకు రూ.4 వేల కోట్ల పంట రుణాలు ఇవ్వాల్సి ఉండగా రూ.905 కోట్లే ఇచ్చారని తెలిపారు. దేవాదాయ భూములు సాగు చేసేవారికీ పంట రుణాలివ్వాలన్నారు. ఈ అన్ని అంశాలపై నిర్వహించే మహాధర్నాకు అన్ని రంగాల వారు తరలిరావాలని కోరారు. సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.హనుమంతరెడ్డి, ఎస్.ఆంజనేయ నాయక్, ఉపాధ్యక్షులు గుంటూరు విజయ్ కుమార్, పి.వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి జి.రవిబాబు, కోశాధికారి డి.శివకుమారి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎ.లక్ష్మీశ్వరరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జి.బాలకృష్ణ, కౌలురైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి హనుమంతరావు, నాయకులు విమల, పెద్దిరాజు, మహేష్, సిలార్ మసూద్, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

'సురక్ష' రోగులకు సత్వర చికిత్సలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల నుంచి వచ్చే రోగులకు సత్వరమే వైద్య సేవలు అందించాలని సూపరిం టెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ సూచించారు. శుక్ర వారం శుశ్రుత హాలులో ఆసుపత్రి హెచ ఒడిలతో జరిగిన సమా వేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆసుపత్రి లో ప్రతి రోగి కి వైద్య పరీక్షలు చేసి అవసరమైతే అడ్మిట్ చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని, ఈ ప్రభుత్వ కార్యక్రమాన్ని ప్రతి విభాగం హెచ్ఒడి బాధ్యతగా తీసు కోవాలని అన్నారు. ప్రతిరోజూ ఆరోగ్య సురక్ష సమాచార కేంద్రాన్ని అసిస్టెంట్ ప్రొఫెసర్ పరిశీలించి అవసరమైన వైద్య సూచనలు పిజిలకు సూచించాలని చెప్పారు. సమాచార కేం ద్రానికి వచ్చినప్పుడు రోగుల అవసరాలను ముందుగా గుర్తించి వారికీ అవసరమైన వైద్య పరీక్షలు చేయాలని, అవసరం అను కుంటే వెంటనే వార్డుల్లో చేర్పించేలా సహకరించాలని చెప్పారు. రానున్న రోజుల్లో ఆసుపత్రికి నూతనంగా సిటి స్కాన్, ఇచ్చేందుకు ఉన్న తాధికారులు అంగీకరించినట్లు చెప్పారు. సిటీ స్కాన్ రాగానే సర్వీస్ బ్లాక్‌లో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. అత్యవసర విభాగం క్యాజువాల్టీ కి వచ్చిన రోగు లకు తక్షణమే వైద్యం అం దించాలని , క్యాజువాల్టీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పర్య వేక్షించాలని, రోగుల శస్త్ర చికిత్సల కోసం రెండు ఆపరేషన్ థియే టర్లను అందు బాటులో ఉంచామని, ఆలస్యం జరగకుండా సర్జరీలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆప రేషన్ థియేటర్ వద్ద బ్లడ్ బ్యాంకు కూడా అందుబాటులో ఉంచా మని, అనస్థీషియా విభాగం వైద్యులు కూడ సహకరించాలని అన్నారు. రాత్రి సమ యాల్లో రోగులు ఎక్కువమంది రావడం వల్ల క్యాజువాల్టీ పూర్తిగా రద్దీగా మారు తోందని,రోగులను ఎప్పటికప్పుడు వార్డులోకి మార్చాలని చెప్పారు. ఆసుపత్రి లోని మృతదేహాలను సకాలంలో వారి స్వస్థలాలకు మహాప్రస్థానం ద్వారా పంపించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎఫ్ఆర్ యస్‌ను సమర్ధ వంతంగా చేసేలా శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. సమావేశంలో డిప్యూటీ సూపరిం టెం డెంట్లు డాక్టర్ గోవిడ్ నాయక్, డాక్టర్ శ్రీనివాస ప్రసాద్, సివిల్ సర్జన్ ఆర్ఎమ్ఒ డాక్టర్ సతీష్ కుమార్, ఎడి సుధాకర్ పాల్గొన్నారు.

హెచ్‌ఒడిలతో సమావేశంలో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్

యర్రబాలెంలో రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరి - తాడేపల్లి కార్పొరేషన్ పరిధి యర్రబాలెంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని మంగళగిరి రూరల్ పోలీసులు పట్టుకున్నారు. మంగళగిరి రూరల్ ఎస్ఐ క్రాంతి కిరణ్ తెలిపిన వివరాల మేరకు తాడేపల్లి ఎన్టీఆర్ కరకట్ట కు చెందిన చిట్టి పోతుల జోజి బాబు కార్పొరేషన్ పరిధి యర్రబాలెం లో ఇంటింటా తిరిగి 35బస్తాల రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేశాడు. అనంతరం ఆ బియ్యాన్ని ఆటోలో రేపల్లె కు తరలించేందుకు సిద్ధమయ్యాడు. పక్కా సమాచారం అందుకున్న మంగళగిరి రూరల్ పోలీసులు గురువారం రాత్రి మెరుపు దాడి నిర్వహించి రేషన్ బియ్యం తరలిస్తున్న జోజి బాబును అదుపులోకి తీసుకున్నారు. ఆటోను సీజ్ చేసి స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విఆర్ఎ మృతి

ప్రజాశక్తి-బెల్లంకొండ: బెల్లం కొండ వీఆర్ఏ మరియ దాసు శుక్ర వారం ఉదయం ఐదు గంటలకు మృతి చెందారు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శుక్రవారం ఉదయం తుది శ్వాస విడిచారు. విఆర్ఎ మృతదేహాన్ని సిఐటియు మం డల కార్యదర్శి సిహెచ్ పుల్లారావు సందర్శించి నివాళులర్పించారు.

లక్ష్య నిర్ణయం, నిర్దేశాలే విజయ సోపానాలు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్: విద్యార్థులు జీవితంలో సరైన లక్ష్యాన్ని నిర్దేశించుకోవటం అన్నింటికన్నా ముఖ్యమని కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు అన్నారు. వర్శిటీలోని ఆర్ట్స్ విభాగం (బి.ఏ.ఐ.ఏ.ఎస్.) ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన భారత రాజ్యాంగ దినోత్సవం ఎత్నిక్ డే వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు.

తోపుడుబండ్లు అందజేత

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలో చిరువ్యాపారాలు నిర్వహించుకునే ఖాశింబి, ఎం.చంద్, గడ్డం సాంబయ్యలకు టిడిపి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు తోపుడుబండ్లు అంద జేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు డి.సుందరరావు యాద్, ఎ.మురళీ, డి.గోపి, భాస్కర్, ఎం.గోపాలరెడ్డి, ఎం.పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒంటరి మహిళపై వేధింపులు

ప్రజాశక్తి-తాడేపల్లి

విజయవాడలో హెూంగార్డుగా పని చేస్తున్న పూర్ణ చంద్రరావు పెనుమాక గ్రామంలో ఒంటరిగా ఉన్న మహిళపై వేధింపులకు దిగాడు. గురువారం రాత్రి 11 గంటల సమయంలో ఆమె ఇంటి తలుపు తట్టి అసభ్యంగా ప్రవర్తించినట్లు బాధితులు తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె పెద్దగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు పెద్దఎత్తున రావడంతో హెూంగార్డు పారిపోయాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలల హక్కులను పరిరక్షించండి

ప్రజాశక్తి-క్రోసూరు

క్రోసూరు మండల కేంద్రంలో అమరావతి గుడ్‌షెఫర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ మండల స్థాయి అధికారులతో శుక్ర వారం సమావేశం నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి ఇఒపిఆర్‌డి పి.శివరామయ్య అధ్యక్షత వహించారు. సీనియర్ సిస్టర్ విన్న రసి సుపీరియం, డైరెక్టర్ మాట్లా డుతూ బాలల రక్షణ కమిటీలు గ్రామస్థాయిలో బలోపేతం చేయుడమే ముఖ్యమని, గ్రామస్థాయిలోని అధికారులు పర్యవేక్షణలోని బాలల హక్కులు కాపాడతామన్నారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ మాధవి, ఎంపిపి స్కూల్ టీచర్ లక్ష్మీ, ఎంపిపి కోటయ్య, జడ్పిటిసి గౌస్, పంచాయతి సెక్రటరీ ఖాజావలి మాట్లాడారు.

మిర్చి నిల్వలు

	బ్యాగులు
మిర్చి దిగుమతి	: 26,425
మిర్చి ఎగుమతి	: 26,755
మిర్చి నిల్వ	: 8,772

మిర్చి ధరలు

	రూపాయలలో
334	9,800 - 23,500
నెం.5	10,500 - 20,500
341	10,000 - 22,500
	నాన్ ఎసి
తేజ	9,000 - 24,100
బడిగి	9,000 - 23,000
దేవనూరు డీలక్స్	13,000 - 22,700
తాలుకాయలు	7,000 -12,800
	ఎసి
334	15,000 - 23,000
నెం.5	19,000 - 19,000
341	10,000 - 21,000
తేజ	11,000 - 24,000
బడిగి	15,000 - 27,000
దేవనూరు డీలక్స్	19,000 -19,000
తాలుకాయలు	7,000 -11,500

అభివృద్ధి పనులను ఆటంకపరిస్తే చర్యలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్ : గ్రామాల్లో అభివద్ధి కమిటీ సభ్యులు, కాంట్రాక్టర్లు చేసిన పనులకు సకాలంలో బిల్లులు చేయకుండా, అభివద్ధి పనులను ఆటంకపరిచే అధికారులను ఉపేక్షించేది లేదని పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశపహాలలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రశ్నించారు. సమావేశానికి పొన్నూరు ఎంపీపీ భవనం పద్మలీల అధ్యక్షత వహించారు. సమావేశంలో ఎమ్మెల్యే కిలారి మాట్లాడుతూ నియోజవర్గంలో అభివృద్ధి పనులకు కొంతమంది అధికారులు, ప్రతిపక్ష నాయకులు అడ్డు తగులుతున్నారని, వారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోశయ్య

మహారాజశ్రీ నరసరావుపేట అడిషినల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు యిలాకా
IP.No: 371/2023 IN. IP.No: 6/2023.
Between:-
జవ్వాజి శేష భాగ్యలక్ష్మి ....పిటిషనర్
ఎదిరి
కాళంగి నాగేశ్వరరావు వగైరాలు ...రెస్పాండెంట్లు.
పై నెం. IP.371/2023, IP:6/2023 అను వాజ్యంలో మీలో 1వ నెం. వారు కాళంగి నాగేశ్వరరావు S/o సీతారామయ్య, నకరికల్లు మరి కొందరిపై ఈ వాజ్యం దాఖలు చేయగా కోర్టు వారి ఆదేశాలతో అనేక పర్యాయములు కోర్టు వారి ద్వారా మరియు పోస్ట్ ద్వారా నోటీసులు పంపిననూ మీరు నోటీసులు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున కోర్టు వారి ఆదేశాల ప్రకారం ఈ పేపర్ ప్రకటన ద్వారా మీ నోటీసు నిమిత్తం ది.30-11-2023 వాయిదా వేసినారు. సదరు వాయిదా తేదీన ఉదయం 10:30 ని.లకు పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల అభ్యంతరములు తెలియపరచుకోగలరు.
కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం
వాయిదా ది.30-11-2023.
ఇట్లు.
కట్టా నారపరెడ్డి,
న్యాయవాది, నరసరావుపేట,
Cell.No: 944077926, 8309088434.

మహారాజశ్రీ నరసరావుపేట అడిషినల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు యిలాకా
IP.No: 6/2023.
Between:-
జవ్వాజి శేష భాగ్యలక్ష్మి ....పిటిషనర్
ఎదిరి
కాళంగి నాగేశ్వరరావు వగైరాలు ...రెస్పాండెంట్లు.
పై నెం. IP:6/2023 లో పై కోర్టులో తెలిపిన 1వ రెస్పాండెంట్ కాళంగి నాగేశ్వరరావు S/o సీతారామయ్య, నకరికల్లు అనువారిపై మరియు కొందరిపై ఈ వాజ్యం దాఖలు చేయగా కోర్టు వారి ఆదేశాలతో అనేక పర్యాయములు పై కోర్టు వారి ద్వారా మరియు పోస్ట్ ద్వారా నోటీసులు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారి ఆదేశాల ప్రకారం ఈ పేపర్ ప్రకటన ద్వారా మీ నోటీసు నిమిత్తం ది.30-11-2023 వాయిదా వేసినారు. సదరు వాయిదా తేదీన ఉదయం 10:30 ని.లకు పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల అభ్యంతరములు తెలియపరచుకోగలరు.
కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం
వాయిదా ది.30-11-2023.
ఇట్లు.
కట్టా నారపరెడ్డి,
న్యాయవాది, నరసరావుపేట,
Cell.No: 944077926, 8309088434.

Court Notice
IN THE COURT OF THE HON'BLE PRL.SENIOR CIVIL JUDGE::GUNTUR
O.S.No: 75/2022
Between:
Smt.Chinnam Suseela ....Plaintiff
AND
Medabalimi Syam Kumar .... Defendant
To,
Medabalimi Syam Kumar, S/o.Chennaiah, R/o.Flat No.G, 2nd floor, Shivam Apartments, Beside Canara Bank, Pedakakani(Vil& Md), Guntur Dist.
పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా సమన్లు పంపించినను మీరు తీసుకోనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీకు Substitute Service ద్వారా పేపరులో ప్రకటన ద్వారా తెలియపరచమని ఆర్డరు వేయగా, సదరు ఆర్డరు ప్రకారము మీరు ది:08-12-2023న ఉ. గం.10-30 ని.లకు పై తెలిపిన కోర్టునకు మీరు స్వయంగా కానీ, మీ అడ్వకేటు ద్వారా గానీ హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియపరచుకొనవలయును. లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని తెలియపర్చుడమైనది.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో)
వాయిదా తేది:08-12-2023
బొప్పా శ్రీనివాస రావు,
వాది తరపు అడ్వకేట్,
గుంటూరు.

Notice
IN THE COURT OF THE HON'BLE IV ADDL.SENIOR CIVIL JUDGE::GUNTUR
I.A No:307 /2022 in O.S.No: 207/2012
Between:
Chavali Nagendramma & 2 Others ...Petitioners/ Plaintiffs
AND
Chavali Satyavathi & 9 Others …Respondents /Defendants
To,
R-10: Gairuboina Baby Shalini, D/o.Late Marri Sambha Siva Rao, R/o.Chinakakani Village, Mangalagiri Mandal, Guntur Dist.
పై నెంబరు దావాలోని .ఎ.నెం:307/2022లో 10వ రెస్పాండెంట్లు అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా నోటీసులు పంపించినను మీరు తీసుకోనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీకు Substitute Service ద్వారా పేపరులో ప్రకటన ద్వారా తెలియపరచమని ఆర్డరు వేయగా, సదరు ఆర్డరు ప్రకారము మీరు ది:30-11-2023న ఉ.గం.10-30 ని.లకు పై తెలిపిన కోర్టునకు మీరు స్వయంగా కానీ, మీ అడ్వకేటు ద్వారా గానీ హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియపరచు కొనవలయును. లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించ బడునని తెలియపర్చుడమైనది.
(శ్రీ కోర్టు వారి అనుమతితో)
వాయిదా తేది:30-11-2023
జూపూడి రంగ రాజు,
జూపూడి యజ్ఞ దత్,
పిటీషనరు తరపు అడ్వకేట్స్,
గుంటూరు.

Court Notice
IN THE COURT OF THE HON'BLE IV ADDL.SENIOR CIVIL JUDGE::GUNTUR
O.S.No: 211/2022
Between:
Maddineni Dhruv Kumar and Another ....Plaintiffs
AND
Tummala Siva Gangadhar Rao and Another .... Defendants
To,
D-1:Tummala Siva Gangadhar Rao, S/o.Appa Rao,
D-2: Tummala Venkata Lakshmi, W/o.Siva Gangadhar Rao,
Both are R/o.Door No:8-335, Perecherla Village, Medikonduru Mandal, Guntur Dist.
పై నెంబరు దావాలో ప్రతివాదులు అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా సమన్లు పంపించినను మీరు తీసుకోనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీకు Substitute Service ద్వారా పేపరులో ప్రకటన ద్వారా తెలియపరచమని ఆర్డరు వేయగా, సదరు ఆర్డరు ప్రకారము మీరు ది:05-12-2023న ఉ. గం.10-30 ని.లకు పై తెలిపిన కోర్టునకు మీరు స్వయంగా కానీ, మీ అడ్వకేటు ద్వారా గానీ హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియపరచుకొనవలయును. లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించ బడునని తెలియపర్చుడమైనది.
(శ్రీ కోర్టు వారి అనుమతితో)
వాయిదా తేది:05-12-2023
ముప్పానేని చౌదరి రావు,
వాదుల తరపు అడ్వకేట్,
గుంటూరు, సెల్:98499 63461

ఎల్ఐసి పరిరక్షణ కోసం పోరాడిన బాసుదేవ్ ఆచార్య

ప్రజాశక్తి-చిలకలూరిపేట

జీవిత బీమా సంస్థ (ఎల్ఐసి) ఏజెంట్ల సమస్యలు, ఎల్ఐసి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పార్లమెంటులో గళం వినిపించిన ప్రజానాయకుడు, 11 సార్లు ఎంపీగా ఎన్నికవడంతోపాటు పలుమార్లు ఉత్తమ పార్లమెంటేరియన్‌గా ఎంపికైన మహానాయకుడు బాసుదేవ్ ఆచార్య అని ఎల్ఐసి ఎఐఒ పట్టణ అధ్యక్షులు చేవూరి కృష్ణమూర్తి అన్నారు. స్థానిక ఎన్ఆర్‌టి సెంటర్‌లోని ఎల్ఐసి కార్యాలయంలో బాసుదేవ్ ఆచార్య సంతాప సభ పి.నాగభూషణం అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలేసిన అనంతరం సీనియర్ బ్రాంచి మేనేజర్ పి.శేషగిరిరావు మాట్లాడుతూ జీవిత బీమా సంస్థ కోసం, ఏజెంట్ల హక్కుల కోసం నిరంతరం బాసుదేవ ఆచార్య పోరాడారన్నారు. ఏజెంట్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (ఎఒఐ)ను స్థాపించి ఏజెంట్ల హక్కుల కోసం పోరాడారని ఎఒఐ డివిజనల్ జయింట్ సెక్రటరీ గ్రంధి వీరయ్య అన్నారు. ఎల్ఐసి సీనియర్ ఏజెంట్, లియాఫీ డివిజనల్ వైస్ ప్రెసిడెంట్ షేక్ అలిమియా మాట్లాడుతూ జీవిత బీమా సంస్థను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి పోనివ్వకుండా బాసుదేవ్ ఆచార్య పోరాడారని, ఆయన ఆశయాలను కొనసాగిద్దామని చెప్పారు. కార్యక్రమంలో బ్రాంచ్ సెక్రటరీ ఎస్‌వి.అబ్రహాం, ట్రెజరర్ నల్లపనేని సాంబశివరావు, డెవలపమెంట్ ఆఫీసర్ కె.వి.లక్ష్మీనారాయణ, ఏజెంట్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సంతాపం తెలుపుతున్న ఏజెంట్లు, అధికారులు, నాయకులు

సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి బ్రహ్మారెడ్డి

టిడిపి, జనసేన మధ్య స్పర్థలు పెట్టే కుట్ర

అసత్య ప్రచారాలను నమ్మకుండా కలిసికట్టుగా పనిచేయాలి

టిడిపి మాచర్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి బ్రహ్మారెడ్డి

ప్రజాశక్తి -కారంపూడి

టిడిపి జనసేన నాయకులు కలిసికట్టుగా పనిచేసి ఎన్నికల్లో గెలుపుకోసం కృషి చేయాలని టిడిపి మాచర్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. స్థానిక ఆంజనేయ ఫంక్షన్ హాలులో టిడిపి, జనసేన ఆత్మీయ సమావేశం శుక్రవారం నిర్వహించారు. బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ ఈ రెండు నెలలు, రెండు పార్టీల కార్యకర్తలు ఐక్యంగా పని చేసి ఓట్ల మార్పులు, చేర్పుల విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని చెప్పారు. రెండు పార్టీల కార్యకర్తల మధ్య విద్వేషాలు సృష్టించేందుకు వైసిపి ప్రయత్నిస్తోందని, అసత్య ప్రచారాలను ఎవరూ నమ్మొద్దని కోరారు. టిడిపి, జనసేన ప్రభుత్వం అధికారంలోకి రావడం తథ్యమని, కష్టపడిన ప్రతి ఒక్కరికీ తగిన గౌరవం, గుర్తింపు ఇస్తామని చెప్పారు. సమావేశంలో జనసేన సమన్వయకర్త బి.రామాంజనేయులు, నాయకులు పి.హరి, ఇరు పార్టీలకు చెందిన పి.అంజయ్య, యు.లక్ష్మీనారాయణ, పి.పుల్లయ్య, జి.సురేష్ యాదవ్ పాల్గొన్నారు.

ధర్నాలో పెన్షనర్లు

గదులను ఖాళీ చేసేదాకా ఉద్యమిస్తాం

- ప్రజలు, రాజకీయ పార్టీలు అండగా నిలవాలని పెన్షనర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి
- 3వ రోజు కొనసాగిన ధర్నా - ఆర్‌డిఒకు విన్నవిస్తామని నాయకుల ప్రకటన

ప్రజాశక్తి-సత్తెనపల్లి టౌన్

బలవంతంగా ఆక్రమించుకున్న తమ భవనాన్ని తక్షణమే ఖాళీ చేయాలని ఏపీ రిటైర్డ్ ప్రభుత్వం ఉద్యోగ సంఘ నాయకులు చేపట్టిన ధర్నా శుక్రవారానికి 3వ రోజుకు చేరుకుంది. పలువురు నాయకులు మాట్లాడుతూ వృద్ధులమైన తాము ఏం చేస్తామనే ధీమాతో పయనీర్ ఆటో మొబైల్ యజమాన్యం మొండిగా వ్యవహరిస్తోందని, తమ పోరాటానికి ప్రజలు, రాజకీయ పార్టీలు అండగా నిలవాలని కోరారురు. అగ్రిమెంటు కాలం పూర్తయినా దౌర్జన్యంగా షాపును నిర్వహిస్తున్న యాజమాన్యం తీరను ప్రజలు, ప్రజాస్వామ్యకవాదులు అర్థం చేసుకోవాలి అన్నారు. వారు ఖాళీ చేసేదాక ధర్నా కొనసాగుతుందని స్పష్టం చేశారు. దీనిపై ఆర్‌డిఒకు విన్నవిస్తామన్నారు. ధర్నాలో అసోసియేషన్ నాయకులు లక్ష్మీనారాయణ, వై.ప్రతాపరెడ్డి, బి.రామారావు, ఆర్.పురుషోత్తం, కేబిఅర్జె ప్రసాద్, నరసింహారెడ్డి, ఎ.ప్రభుదాస్ వెంకట్రావు, కె.హనుమంతరావు, చంద్రయ్య పాల్గొన్నారు.

జెవిడి నిధుల జమకు జాయింట్ ఎకౌంట్స్ నిబంధనను వాయిదా వేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - మాచర్ల

పేద విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందించే విద్యాదీవెన, వసతి దీవెన (జెవిడి) నిధుల విడుదలకు జాయింట్ అకౌంట్ నిబంధన తల్లితండ్రులను, విద్యార్థులను ఇబ్బందులకు గురిచేసే విధంగా ఉందని, ఆ నిబంధన అమలును ప్రస్తుతానికి వాయిదా వేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) పల్నాడు జిల్లా అధ్యక్షులు రాజు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ విద్యా సంవత్సరం మధ్యలో నిబంధనలు పెట్టటం సరైనది కాదన్నారు. తల్లితండ్రులు ఒకచోట, విద్యార్థులు మరోక చోట ఉంటారని, ఎక్కువ మంది విద్యార్థులకు పరీక్షలు ఉన్నాయని, వీటికి సిద్ధమవుతున్న తరుణంలో వారిని బ్యాంకు ఖాతాల పేరుతో తిప్పడం సరికాదని చెప్పారు. లక్షలాది మంది విద్యార్థులకు అతి తక్కువ సమయంలో బ్యాంక్ ఖాతాలు తీసుకోవడం కూడా కష్టమన్నారు. ఈ నెల 28న జెవిడి నిధులు విడుదల చేస్తామని ప్రభుత్వం చెబుతున్న నేపథ్యంలో ఖాతా నిబంధన చాలా నష్టదాయకమని అన్నారు. జాయింట్ అకౌంట్స్‌కు చెందిన సమాచారం ఎక్కువ మంది విద్యార్థులకు తెలియదని, తీసుకున్న అకౌంట్స్ వివరాలను సచివాలయాల్లో అప్‌లోడ్ చేయాల్సి ఉందని, ఇలాంటి పరిస్థితులలో సర్వర్లు కూడా సరిగా పని చేయవని చెప్పారు. పరీక్షల సమయంలో ఇలాంటి గందరగోళాలకు విద్యార్థులను గురి చేయొద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

ఆస్పత్రిలో ఉన్నవారికి అవగాహన కల్పిస్తున్న వైద్యులు

నిమోనియాను తొలి దశలోనే గుర్తిస్తే నయం చేయడం సులువు

కార్పొరేట్ ఆస్పత్రి తరహాలో సత్తెనపల్లి వైద్యశాల నిర్వహణ : జిల్లా ఇమ్మునైజేషన్ అధికారి డాక్టర్ గీతాంజలి

ప్రజాశక్తి-సత్తెనపల్లి

ప్రపంచ నిమోనియా దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వాస్పత్రిలో శుక్రవారం ప్రత్యేక అవగాహనా సదస్సు నిర్వహించారు. చిన్నపిల్లలు నిమోనియా బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ముఖ్యఅతిథులుగా జిల్లా ఇమ్యూనిజేషన్ అధికారి గీతాంజలి, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ హాజరవగా రామకృష్ణ మాట్లాడుతూ చిన్నపిల్లల్లో నిమోనియా లక్షణాలుంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలని చెప్పారు. డాక్టర్ గీతాంజలి మాట్లాడుతూ వ్యాధి లక్షణాలపై అవగాహన ఉంటే తొలిదశలోనే గుర్తించి నయం చేయొచ్చని అన్నారు. నిమోనియా లక్షణాలున్న వారు మొదట్లోనే అప్రమత్తమై మందులు వాడితో సరిపోతుందని చెప్పారు. అనంతరం ఆమె ఆస్పత్రిని పరిశీలించి శుభ్రత, నిర్వహణపై అభినందించారు. కార్పొరేట్ స్థాయిలో ఆస్పత్రి ఉందని, అన్ని ఆస్పత్రులూ ఇలానే ఉంటే ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లేవారు తగ్గి ప్రభుత్వాస్పత్రులకే వస్తారని కితాబిచ్చారు. ఈ సందర్భంగా నిమోనియాపై అవగాహన కోసం రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ లక్ష్మణరావు, ఆర్ఎంఒ శోభారాణి, పీపీ యూనిట్ వైద్యాధికారి నాగపద్మజ, డాక్టర్ అనూష, గైనకాలజిస్ట్ సుజాత, పిల్లల డాక్టర్ ప్రేమ, నర్సింగ్ సూపరింటెండెంట్ రాధ, హెడ్‌నర్స్ వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

యుటిఎఫ్ పల్నాడు కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-ఈపూరు

పల్నాడు జిల్లా యుటిఎఫ్ రెండవ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని యుటిఎఫ్ మండల అధ్యక్షులు వి.నాగేశ్వరావు కోరారు. ఈ మేరకు వాల్‌పోస్టర్లను మండలంలోని కొండ్రముట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం నారపుశెట్టి చంద్రబాల జ్యోతిలక్ష్మితో కలిసి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగేశ్వరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలతోపాటు విద్యారంగంలోని సమస్యల పరిష్కారం కోసం యుటిఎఫ్ నిరంతరం పోరాడుతోందన్నారు. సిపిఎస్ రద్దు, ఓపీఎస్ పునరుద్ధరణకూ అలుపెరగకుండా ఉద్యమిస్తోందని, ప్రభుత్వ విద్యారంగం బలోపేతానికి కృషి చేస్తోందని చెప్పారు. ఈ నేపథ్యంలో ఈనెల 26వ తేదీన గురజాలలోని చల్లగుండ్ల గార్డెన్స్‌లో జరిగే పల్నాడు జిల్లా కౌన్సిల్ సమావేశాలకు ఈపురు మండలం నుండి ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరవ్వాలని కోరారు. ఈ సమావేశాల్లో భవిష్యత్తు కార్యాచరణపై చర్చిస్తారని, జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు పిఎ జిలాని, జి.రామారావు, సిహెచ్ మల్లికార్జునరావు, ఎ.సుబ్బారావు, కె.రాంబాబు, జిజె.నాగరాజు, ఆర్. ఏడుకొండలు, బి.అశోక్ కుమార్, ఎం శ్రీనివాసు నాయక్, పి.రమేష్‌బాబు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు, యుటిఎఫ్ నాయకులు

ఉచిత వైద్య శిబిరాలను గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

- రేపు సంతగుడిపాడులో ఉచిత మెగా వైద్యశిబిరం
- శకుంతల హాస్పిటల్ అధినేత డాక్టర్ ఐలా శ్రీనివాసరావు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని శకుంతల హాస్పిటల్ అధినేత, ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజి, జీర్ణకోశ వ్యాధుల వైద్య నిపుణులు డాక్టర్ ఐలా శ్రీనివాసరావు అన్నారు. మెరుగైన వైద్య సేవలతో పాటు ఆరోగ్య అవగాహన సదస్సులు నిర్వహించాలనే ఉద్దేశ్యంతో తమ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆదివారం రొంపిచర్ల మండలం సంతగుడిపాడు బొడ్రాయి సెంటర్‌లోని కమిటీ హాల్‌లో నిర్వహించే ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సంతగుడిపాడు గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు ఉపయోగించుకుని వైద్యసేవలు పొందాలని సూచించారు. తనతో పాటు ప్రముఖ శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ పాటిమళ్ల నరేంద్రనాథ్ దత్తు కూడా వైద్య సేవలు అందిస్తారన్నారు. లివర్ సమస్యలు, గాల్ బ్లాడర్, పాంక్రియాస్ సమస్యలు, పొట్ట ఉబ్బరం, కడుపునొప్పి, మంట, పచ్చ కామెర్లు, ఛాతీ నొప్పి, ఆకలి లేకపోవడం, బిపి, షుగర్, జలుబు, దగ్గు, జ్వరం, థైరాయిడ్ వంటి సాధారణ వ్యాధులకు కూడా ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తామన్నారు. ఇటీవల కాసు వెంకట కృష్ణారెడ్డి రోడ్డులోని ఎ1 ఫంక్షన్ హాల్ వద్ద స్థాపించిన తమ హాస్పిటల్‌లో అన్ని వర్గాల ప్రజలకు అందుబాటు ధరల్లో వైద్యచికిత్సలు అందిస్తున్నామని వివరించారు.

రైతుల ఆత్మహత్యల నివారణకు చర్యలు తీసుకోవాలి

విజయవాడలో రెండ్రోజుల ధర్నా జయప్రదం చేయాలని నాయకుల విస్తృత ప్రచారం

ప్రజాశక్తి-తాడేపల్లి

రైతుల ఆత్మహత్యల నివారణకు చర్యలు తీసుకోవాలని, అందుక స్వామినాథన్ కమిటీ సూచించిన సిఫార్సులను అమలు చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఉండవల్లి సెంటర్‌లోని ప్రజా సంఘాల కార్యాలయంలో రైతు సంఘం రాజధాని డివిజన్ కమిటీ సమావేశం కె.జగదీశ్వరరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా శివశంకరరావు మాట్లాడుతూ రైతుకు వ్యవసాయం గిట్టుబాటు అయ్యే విధంగా ధరలు నిర్ణయించాలని, స్థిర నిధి ఏర్పాటు చేయాలని శివశంకర్ కోరారు. వ్యవసాయం రంగం ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి పంట ఉత్పత్తి వ్యయానికి 50 శాతం అదనంగా కలిపి కనీస మద్దతు ధర చట్టం చేయాలని కోరారు. రైతులకు వ్యతిరేకంగా 2020లో తీసుకొచ్చిన విద్యుత్ బిల్లును ఉపసంహరించుకోవాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. రైతుల పంట పొలాల్లో మోటార్లకు బిగిస్తున్న మీటర్లను నిలుపుదల చేయాలని కోరారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ కింద రైతులకు పంట రుణాలివ్వాలన్నారు. నష్టాల ఊబిలో కూరుకుపోయిన రైతులకు రుణమాఫీ చేయాలన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తూ మోడీ తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించి పత్రికా స్వాతంత్ర్యాన్ని కాపాడాలని కోరారు. ప్రజల ఆస్తులైన ప్రభుత్వ రంగ సంస్థలను తెగనమ్మడం మానుకోవాలన్నారు. పార్లమెంట్ సాక్షిగా ఎపికి ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటుపరం చేయొద్దని కోరారు. కొండవీటి వాగులో తూటుకాడను నిర్మూలించాలని, రాజధాని కౌలు రైతులందరికీ వెంటనే కౌలు చెల్లించాలని, ప్లాట్ రిజిస్ట్రేషన్ వెంటనే చేయాలని, అసైన్డ్ రైతులకు కూడా కౌలు చెల్లించాలని కోరారు. ఈ నెల 27, 28 తేదీల్లో విజయవాడ జింఖానా గ్రౌండ్స్‌లో రైతులు నిర్వహించే 36గంటల ధర్నాకు అధిక సంఖ్యలో రైతాంగం పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో వై.శ్రీనివాసరావు, ఎస్‌కె పీరూసాహెబ్, బి.బక్కిరెడ్డి, నాగేశ్వరరావు, గణేష్, ఈమని రామారావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జొన్నా శివశంకరరావు

గుంటూరులో సిఐటియు విస్తృత సమావేశం

ప్రజాశక్తి-గుంటూరు

కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిఐటియు, రైతు సంఘం ఆధ్వర్యంలో ఈనెల 27, 28 తేదీల్లో విజయవాడలోని రాజభవన్‌వద్ద జరిగే 36 గంటల ధర్నాలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ కార్మికులకు పిలుపునిచ్చారు. శుక్రవారం పాతగుంటూరు సిఐటియు కార్యాలయంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ అధ్యక్షతన నిర్వహించిన సిఐటియు జిల్లా కౌన్సిల్ సమాశంలో నేతాజి మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బిజెపి అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం, రాజ్యాంగ పరిరక్షణ ఐక్య పోరాటాల ద్వారానే సాధ్యమని అన్నారు. ప్రముఖ కార్మిక నాయకుడు, సిఐటియు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు పర్సా సత్యనారాయణ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ప్రతి మండలంలో, వాడవాడలా సాంస్కృతిక కార్యక్రమాలు జరిపేందుకు కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. విశాఖ ఉక్కు పరిరక్షణకై ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసిన 42 మంది ఎమ్మెల్యేలలో సత్యనారాయణ ఒకరిని తెలిపారు. సమావేశంలో బి.లక్ష్మణరావు, ఎస్.కె.హుస్సేన్‌వలి, యన్.శివాజీ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నేతాజి

వంద పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలి

రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్

ప్రజాశక్తి-మంగళగిరి :మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. శుక్రవారం సాయంత్రం మంగళగిరి ప్రజా ఆరోగ్య వేదిక రీజినల్ కమిటీ, వంద పడకల సమగ్ర ఆస్పత్రి సాధన కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం మంగళగిరి పెన్షనర్స్ హాల్లో డాక్టర్ వంశీకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రి శిథిలావస్థకు చేరుకుందని దీన్ని వెంటనే వంద పడకల ఆసుపత్రి చేసి అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఇందు గాను ప్రజా ఆరోగ్య వేదిక రానున్న రోజుల్లో జరిగే పోరాటాలకు మద్దతుగా ఉంటానని తెలిపారు. అదే విధంగా ఆరోగ్యాన్ని ప్రాథమిక హక్కుగా కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం చట్టం చేయాలని అన్నారు. ఇందుకు ప్రజలు ప్రజా ఆరోగ్య వేదిక చేసే పోరాటాలకు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. జిడిపిలో ఆరోగ్య రంగానికి ఏడు శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మంగళగిరి ఎయిమ్స్ కు రాష్ట్ర ప్రభుత్వం తాగునీటి సౌకర్యం వెంటనే కల్పించాలని డిమాండ్ చేశారు. మంగళగిరి ఎయిమ్స్ రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రిని ఏరియా ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలని, వైద్యులను నియమించాలని కోరారు. ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కె వి ఎస్ సాయి ప్రసాద్ మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కావడం లేదని అన్నారు. గత ప్రభుత్వంలో ప్రజా ఆరోగ్య వేదిక ఆధ్వర్యంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు దృష్టికి తీసుకువెళ్లి రూ.40 లక్షల నిధులు మంజూరు చేయించడం జరిగిందని, ఆ నిధులతో కొంతవరకు ఆసుపత్రి భవనాలను మెరుగుపరచడం జరిగిందని అన్నారు. శిథిలావస్థలో ఉన్న భవనాన్ని నూతన భవనాలు నిర్మించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. టిడిపి నాయకులు జి ధనుంజయ్ రావు మాట్లాడుతూ రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం ఏర్పడితే ఇక్కడ నుండి ఎమ్మెల్యేగా నారా లోకేష్ ఎన్నికైతే తప్పనిసరిగా మంగళగిరి ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దడానికి లోకేష్ ను ఒప్పిస్తానని హామీ ఇచ్చారు. సిపిఐ నియోజవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య మాట్లాడుతూ ప్రజా ఆరోగ్య వేదిక ఆధ్వర్యంలో మంగళగిరి ప్రభుత్వాసుపత్రి గురించి జరిగే పోరాటంలో సిపిఐ అండగా ఉంటుందని తెలిపారు. ఎమ్మెల్యే ఆర్కే ప్రభుత్వ ఆసుపత్రి గురించి పట్టించుకోవడం దారుణమని అన్నారు. సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ ఎస్. చెంగయ్య మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆర్కే ఇటీవల మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి ఆసుపత్రి ఈ విధంగా ఉందా అని మాట్లాడ్డం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. గత తొమ్మిది సంవత్సరాలుగా ఎమ్మెల్యేగా ఇక్కడ పనిచేస్తూ ఆసుపత్రి గురించి తెలియదు అనడం దారుణమని అన్నారు. ఆసుపత్రి స్థలంలో కాంప్లెక్స్ నిర్మాణానికి జీవో తీసుకొస్తే దాన్ని వ్యతిరేకిస్తూ హైకోర్టుకెళ్ళి రద్దు చేయించడం జరిగిందని అన్నారు. సమావేశంలో వంద పడకల ఆసుపత్రి సాధన కమిటీ నాయకులు నన్నపనేని నాగేశ్వరావు, ఎం నాగేశ్వరావు, డి నాగలక్ష్మి, ప్రజా ఆరోగ్య వేదిక మంగళగిరి రీజియన్ కార్యదర్శి ఏ జయరాజు, వివిధ ప్రజా సంఘాల నాయకులు వి వి ప్రసాద్, వి వెంకటేశ్వరరావు, జేవీ రాఘవులు, ఎం రవి, ఎ బాలకృష్ణ, ఎస్ బాలకృష్ణ, ఎం భాగ్యరాజు, టి శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

రాహుల్‌ని కలిసిన శీలం, మస్తాన్‌వలి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

తెలంగాణ ఎన్నికల ప్రచారానికి వెళ్తున్న కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ శుక్రవారం గన్నవరం వచ్చారు. గన్నవరం విమానాశ్రయంలో జిల్లాకు చెందిన కేంద్ర మాజీ మంత్రి జె.డి.శీలం, పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలి స్వాగతం పలికి పార్టీకి చెందిన అంశాలపై చర్చించారు. వీరితోపాటు పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, :మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

రేపు కొయ్య గుర్రం పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-తెనాలి :పట్టణానికి చెందిన తెనాలి ప్రచురణలు ఆధ్వర్యంలో ఈనెల 19న నగ్నముని రచించిన ఆధునిక మహాకావ్యం 'కొయ్య గుర్రం' ఆవిష్కరణ సభ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. స్థానిక నందుల పేట కవిరాజ పార్క్ లో సాయంత్రం 6 గంటలకు నిర్వహించే ఆవిష్కరణ సభలో శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధ ప్రసాద్, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొననున్నారు. అలాగే సభానంతరం ప్రముఖ వైద్యులు డాక్టర్ గుత్తి సుబ్రమణ్యం తో పాటు పలువురుని సత్కరిస్తున్నట్లు తెలిపారు.

సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న మాజీ మంత్రి ఆలపాటి

ఓటర్ల జాబితాలో అవకతవకలపై

సమగ్ర విచారణ చేపట్టాలి : ఆలపాటి

ప్రజాశక్తి-తెనాలి

ఓటరు జాబితాలో అవకతవకలను సరిచేసేందుకు సమగ్ర విచారణ జరిపించాలని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. ఓటరు జాబితాలో జీరో డోర్ నెంబర్‌తో ఓట్లు, చనిపోయిన వారి ఓట్లను జాబితా నుంచి తొలగించకపోవటం, ఒకే ఇంటి వారి ఓట్లు వేర్వేరు పోలింగ్ బూత్‌లో ఉండటానికి సంబందించిన ఆధారాలను ఆయన శుక్రవారం సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మకు సమర్పించారు. పరిస్థితిని వివరించి, విచారణ జరిపించాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా ఆలపాటి మాట్లాడుతూ ఓటరు జాబితాలో అవకతవకలపై పలుమార్లు పిర్యాదు చేసినట్టు చెప్పారు. గతంలో చేసిన కొన్ని పిర్యాదులపై సబ్ కలెక్టర్ స్పందనకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తాజాగా మరికొన్ని అవకతవకలను గుర్తించి, వాటిపై విచారణ జరిపి సంబందిత బిఎల్వోలపై చర్యలు తీసుకోవాల్సిందిగా కోరామన్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు టి.హరిప్రసాద్, ఆర్.సూర్యకిరణ్‌తేజ, దేశు యుగంధర్, డాక్టర్ వి.శేషగిరిరావు, ఈదర శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

ధృఢమైన వస్తువులకు కేరాఫ్ శ్రీఎస్ఆర్ ఫర్నిచర్ విలేజ్

ప్రజాశక్తి - మంగళగిరి

నాణ్యమైన, ధృఢమైన ఫర్నిచర్‌కు కేరాఫ్ శ్రీ ఎన్.ఆర్ ఫర్నిచర్ విలేజ్ అని మేనేజర్ దయ శంకర్ శుక్రవారం మంగళగిరిలో తెలిపారు. సీసం వుడ్, నార్త్ ఇండియన్ రోజ్ వుడ్‌తో తయారు చేయబడిన డబల్ కాట్ మంచాలు, డైనింగ్ టేబుల్స్, సోఫాసు, అన్ని రకాల వుడ్ ఐటమ్స్ సరసమైన ధరలతో లభిస్తాయని తెలిపారు. జీవితకాలం మన్నిక కలిగి ఉంటుందని, పది సంవత్సరాలు వారంటీ, ఒక సంవత్సరం గ్యారెంటీ కంపెనీ ఇస్తుందని తెలిపారు. ఈ వుడ్ ఐటమ్స్ కు పుచ్చు పట్టదని తెలిపారు. మంగళగిరి బైపాస్ రోడ్డులోని పాత మంగళగిరి వద్ద తమ షాపు ఉందని, మంగళగిరి బ్రాంచ్‌తో పాటు గుంటూరు, బెంగళూరులో కూడా బ్రాంచ్‌లు ఉన్నాయని తెలిపారు. రాజసాన్‌లో సొంత ఉడ్ ఐటమ్స్ తయారీ ఉందని తెలిపారు. కస్టమర్లకు దృఢమైన, నాణ్యమైన, కలిగిన వుడ్ ఐటమ్స్ ను అందించడంలో మా శ్రీ ఎన్ ఆర్ ఫర్నిచర్ విలేజ్ ప్రత్యేకత అని, అన్ని రోజుల్లో 50 శాతం డిస్కౌంట్ సౌకర్యం ఉందన్నారు.

సిబార్‌లో అరుదైన శస్త్రచికిత్స

ప్రజాశక్తి - పెదకాకాని రూరల్

ఆంధ్ర ప్రదేశ్ లోనే మొట్టమొదటిసారిగా అరుదైన శాస్త్ర చికిత్స ద్వారా టెంపోరో మ్యాండి బులర్ జాయింట్ పోస్టాసిస్ సహాయంతో ఇరువైపులా దవడ కీలు మార్పిడి విజయవంతముగా పూర్తి చేసినట్లు తక్కెళ్ళపాడు సిబార్ దంత వైద్య కళాశాల దీన్ లింగమనేని కృష్ణ ప్రసాద్ తెలిపారు. మండల పరిధిలోని నంబూరు గ్రామానికి చెందిన 27 సంవత్సరాలు వయసు గల నాగ మౌనిక పుట్టుకతోనే నోరు తెరవక బాధపడుతూ ఎన్నో ఆసుపత్రి చుట్టూ తిరిగి నిరాశ చెందారని తెలిపారు. సిబార్ దంత వైద్య కళాశాలను సంప్రదించగా వైద్యులు పరీక్షించి ఇరువైపులా దవడ కీలు అతుక్కుని ఉండటంతో శస్త్ర చికిత్స చేయడానికి నిర్ధారించినట్లు తెలిపారు. డాక్టర్ లింగమనేని కృష్ణ ప్రసాద్, శ్రీనివాస్ చక్రవర్తి, నూరుద్దీన్, రాజా సతీష్, ఆనంద్ విజయ్, వివేకానంద, మనోజ్ కుమార్, విద్యాసాగర్, పూజ, హిందూజా చికిత్సలో పాల్గొన్నారు.

పిల్లల్లో పఠనాసక్తి బాధ్యత తల్లిదండ్రులదే

ప్రజాశక్తి-చిలకలూరిపేట

జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా నాల్గో రోజు శుక్రవారం స్థానిక శాఖా గ్రంథా లయంలోలయన్స్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వ ర్యంలో కార్యక్రమాలు జరిగాయి. క్లబ్ అధ్యక్షులు రావికింది మణికుమార్ అధ్యక్ష తన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ న్యాయ వాది, మాజీ ఎజిపి ఎన్.కోటేశ్వరమ్మ పాల్గొని మాట్లాడారు. పిల్లల్లో పఠనాసక్తి కలిగించే బాధ్యత తల్లిదండ్రు లదే అన్నారు. బాల్యంలోనే పుస్తక పఠనం అలవాటు చేయాలని, నైతిక విలువలతో పాటు వ్యక్తిత్వ వికాసం కూడా గ్రంథ పఠనం ద్వారా కలుగుతుందన్నారు. తొలుత గ్రంథాలయ ప్రముఖుల చిత్ర పటాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆనంతరం విద్యార్థులకు పర్యావరణం పై చిత్రలేఖనం పోటీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆ క్లబ్ మాజీ అధ్యక్షులు పి.నాగేశ్వరరావు, ఎక్కల దేవేంద్ర రాజేష్, లయన్స్ మహిళ క్లబ్ అధ్యక్షురాలు ఆర్.లీల కీర్తన, ఈదర గోపి చంద్, డా.పివి సుబ్బారావు, దార్ల బుజ్జిబాబు, గ్రంథా లయ ఇంచార్జ్ అధికారి నాగుల్ మీరా వలి పాల్గొన్నారు. **సత్తెనపల్లి:** పట్టణంలోని జిల్లా శాఖ గ్రంథాలయంలో చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో స్థానిక సుగాలి కాలనీ హై స్కూల్, శిశు మందిర్ హై స్కూల్,భవిష్య స్కూల్,జడ్పీహెచ్ స్కూల్ లోని విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ లెక్చరర్ ఉమామహేశ్వరరావు జడ్పీహెచ్ఎస్ స్కూల్ డ్రాయింగ్ టీచర్ వెంకటరమణ, గ్రంథాలయం సిబ్బంది రజని పాల్గొన్నారు.**యడ్లపాడు:** స్థానిక శాఖా గ్రంథాలయంలో వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహిచారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ప్రజాశక్తి విలేకరి మానుకొండ రామా రావు అధ్యక్షత వహిం చారు. గ్రంథాలయాలు వాటి ఆవశ్య కత గురించి విద్యా ర్థులకు ఆయన వివరించారు. కార్యక్రమంలో చేవూరి అంజమ్మ పాల్గొన్నారు. **రొంపిచర్ల:** మండలంలో సంత గుడి పాడు శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో గ్రామంలోని కస్తూర్బా గాంధీ విద్యా లయంలో విద్యార్థినిలకు చిత్ర లేఖనం పోటీలు నిర్వ హించారు. రొంపిచర్ల శాఖా గ్రంథా లయం ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సంతగుడిపాడు శాఖా గ్రంథా లయంలో కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి అచ్చుల సుబ్బారావుకు సన్మానం చేశారు. ఆయా శాఖా గ్రంథాలయాల అధికారులు క్రోసూరు వెంకట్రావు, సుబ్బారావు పాల్గొన్నారు. **పెదకూరపాడు:** స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో విద్యార్థినీ విద్యా ర్థులకు వ్యాస రచన పోటీలు, వక్తృత్వ పోటీలు నిర్వ హించారు. మండలంలోని సెయింట్ ఆన్స ఇంగ్లీష్ మీడి యం స్కూల్ ,కాకతీయ హై స్కూల్, పెదకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఇతర పాఠశాల విద్యార్థులు పాల్గొ న్నారు. **మాచర్ల** గ్రంథాలయాలను ఉపయోగించుకొని యువత విజ్ఞానవంతులు కావాలని గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పోలిశెట్టి పుల్లారావు అన్నారు స్థానిక శాఖ గ్రంథాలయంలో వ్యాసరచన పోటీలు జరిగాయి. ఉపాధ్యాయ సంఘం నాయకులు గాదె కిరీటి రెడ్డి లైబ్రరీ ఇంచార్జి ఫణి భూషణ్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయ సంఘం నాయకురాలు ఆయేషా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణ కోసమే ఉద్యమాలు

యుటిఎఫ్ పల్నాడు జిల్లా కమిటీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సమావేశంలో మాట్లాడుతున్న పి.ప్రేమ్‌కుమార్, పాల్గొన్న యుటిఎఫ్ ఉపాధ్యాయులు

ప్రభుత్వ విద్యారంగ రక్షణ ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ పేద,బడుగు , బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే కోసమే యుటిఎఫ్ ఉద్యమాలు చేస్తుందని యుటిఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్య దర్శులు పి.ప్రేమ్ కుమార్, జి.విజయ సారధి అన్నారు. ఈ మేరకు శుక్రవార పల్నాడు రోడ్డులోని మున్సిపల్ బాలుర హైస్కూల్లో యుటిఎఫ్ నరసరావుపేట మున్సిపల్ శాఖ, మండలం, రొంపిచర్ల, నకరికల్లు శాఖ నూతన కౌన్సిల్, కార్యవర్గ ఎన్నికల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ఎన్.మోహనరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా రంగ బాధ్యతలు నుండి క్రమంగా తప్పుకుంటున్నాయని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన జాతీయ విద్యా విధానం పేరిట విద్యా రంగంలో కార్పొ రేటీకరణ, కాషాయీకరణ, కేంద్రీ కరణ అమలు పరుస్తున్నారన్నారు. శాస్త్రీయ విద్యా విధానాన్ని బుట్ట దాఖలు పరుస్తూ చరిత్రను వక్రీకరిస్తూ పలు విజ్ఞాన అంశాలను పాఠ్యాంశాల నుండి తొల గించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి జాబితాలోని విద్యపై రాష్ట్రల హక్కులను హరిస్తూ కేంద్రం పెత్తనం వలన సమాఖ్య స్ఫూర్తి దెబ్బతింటుందన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాలలో సైతం నూతన జాతీయ విద్యా విధానం అమలుకు సాహ సించకుండా ఉంటే ఆంధ్ర రాష్ట్రంలో మాత్రం ఎర్ర తివాచీ పరిచి అమలకు పూనుకుందన్నారు. విజయ సారథి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 117 జీఓ వలన అనేక ప్రాథమిక పాఠశాలలు కేవలం 1, 2 తరగతులకే పరిమిత మయ్యాయని, అనేక సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ పోస్టులు రేషనలైజేషన్ పేరిట రద్దు చేయడంతో ప్రాథమిక పాఠశాలలో నాణ్యమైన విద్య ఎండమావి అయిందన్నారు. సిపిఎస్ స్థానంలో జిపిఎస్ అనే మోసపూరిత గోల్ మాల్ పెన్షన్ స్కీమ్ తీసుకువచ్చి సిపిఎస్ ఉపా ధ్యాయుల పెన్షన్ విధానాన్ని గందరగోళం చేశారన్నారు. రాష్ట్రంలోని ఉద్యోగ ఉపాధ్యాయులకు పెండింగ్లో ఉన్న టిఎ డిఎ పిఎఫ్ రుణాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా గౌరవాధ్య క్షులు కె.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ యుటిఎఫ్ కార్యకర్తలు సామాజిక స్పృహతో పని చేయాలని సమకాలీన రాజకీయ ఆర్థిక అంశాలు అధ్యయనం చేసి లోతైన అవ గాహనతో ఉపాధ్యాయులను చైతన్య పరుస్తూ సంఘాన్ని బలోపేతం చేయాలన్నారు. అనంతరం నరసరావుపేట మండలం, పట్టణం ,నకరికల్లు, రొంపిచర్ల శాఖలకు కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. జిల్లా సహాధ్యక్షులు ఎం.మోహన్ రావు, ఎ.భాగేశ్వరిదేవి, కె.ఉషా సౌరీ రాణి, టి వెంకటేశ్వర్లు, ఎన్నికలను నిర్వహించారు. రొంపిచర్ల అన్ని పోస్టులు మహిళా ఉపాధ్యాయుణులు ఎంపికవడం విశేషమని జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శిలు అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ ఎన్ సుందరరావు, జిల్లా ఆడిటర్ వై శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు సుధాకర్‌రెడ్డి, శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

యుటిఎఫ్ నరసరావుపేట మండల నూతన కార్యవర్గం గౌరవాధ్యక్షులుగా పి.సత్యనారాయణ, అధ్యక్షులుగా బి.శ్రీనివాస కళ్యాణ్, ప్రధాన కార్యదర్శిగా షేక్ మస్తాన్ షరీఫ్, సహాధ్యక్షులుగా ఎం.మారుతీరావు, జి.రాఘవమ్మ, కోశాధికారిగా డి.శ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నరసరావుపేట మున్సిపల్ శాఖకు 2023-24 ఏడాదికి గౌరవాధ్యక్షులుగా టి.ఏడుకొండలు అధ్యక్షులుగా ఓ.కోటేశ్వరరావు,సహాధ్యక్షులుగా సిహెచ్ .సంపత్ కుమార్, మహిళా సహాధ్యక్షులుగా బి నిర్మల బాయి,ప్రధాన కార్యదర్శిగా కె.వెంకటేశ్వరరావు, కోశాధికారిగా షేక్.అఖీబ్ పాషా అదేవిధంగా రొంపిచర్ల మండల శాఖ గౌరవాధ్యక్షులుగా సీతా మహాలక్ష్మి, అధ్యక్షులుగా షేక్ మల్లికా బేగం, సహాధ్యక్షులుగా జి.శిలువ జ్యోతి, మహిళా సహాధ్యక్షురాలిగా నాగ లక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా కె.కార్మెల్ మేరి, కోశాధికారిగా టి. అనూష, నకరికల్లు మండల శాఖకు గౌరవాధ్యక్షులుగా ఎన్. బ్రహ్మయ్య, అధ్యక్షులుగా పి.యోనా, సహాధ్యక్షులుగా జి.శ్రీహరి ప్రసాద్,కె.వీరమ్మ, ప్రధాన కార్యదర్శిగా వై. శ్రీనివాసరావు, కోశాధికారిగా పి.బాలాజీ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గానికి యుటిఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శిలు అభినందనలు తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా కె.కార్మెల్ మేరి, కోశాధికారిగా టి. అనూష, నకరికల్లు మండల శాఖకు గౌరవాధ్యక్షులుగాఎన్. బ్రహ్మయ్య, అధ్యక్షులుగా పి.యోనా, సహా ధ్యక్షులుగా జి.శ్రీహరి ప్రసాద్,కె.వీరమ్మ, ప్రధాన కార్యదర్శిగా వై. శ్రీనివాసరావు, కోశాధికారిగా పి.బాలాజీ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గానికి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శిలు అభినందనలు తెలిపారు.

'తట్ట మట్టి వేయలేని ప్రభుత్వం ఎందుకు?'

ప్రజాశక్తి-బెల్లంకొండ

బెల్లంకొండ నుంచి అమరావతి వరకు ఉన్న ఆర్ ఆర్ బి రోడ్డు గుంతల్లో ఉందన్న విషయాన్ని వైసిపి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు విస్మరించారని పెద కూరపాడు మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ విమర్శించారు. బెల్లంకొండలోని అధ్వాన స్థితిలో గుంతలు పడి ఉన్న ప్రధాన రహదారులను శుక్రవారం ఆయన పరిశీలించారు . టిడిపి ప్రభుత్వ హయంలో రూ.2.6 కోట్లతో బెల్లంకొండ నుంచి న్యూ చిట్యాల వరకు ఆర్ ఆర్ బి రహదారిని ర్మిచిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ రహదారులకు కనీస మరమ్మతులు లేవని విమర్శించారు. రోడ్లపై తట్ట మట్టి వేయడం చేతకాని ప్రభుత్వం ఎందుకని మండిపడ్డారు. నాలుగున్నరేళ్ల పాటు మిన్నకుండి ఇప్పుడు వరికపూడిశెల ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయడం, కేవలం ఓట్లు దండుకునేందుకేనని విమర్శించారు.

నగరవనం పనులు సకాలంలో పూర్తి చేయండి

జిల్లా అటవీశాఖ అధికారి రామచంద్రారావు

ప్రజాశక్తి-మాచర్ల

పట్టణంలో చేపట్టబోయే నగరవనం పనులు సకాలంలో పూర్తి చేసేందుకు స్థానిక అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పని చేయాలని జిల్లా అటవీశాఖ అధికారి ఎన్ రామచంద్రారావు సూచించారు. ఆయన స్థానికంగా నగరవనంకు కేటయించిన భూమిలో జరుగుతున్న పనులను పరిశీలన చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ 2కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసే నగరవనం పనులకు కేంద్ర ప్రభుత్వం రూ1.40 కోట్ల నిధులు వివిధ పనుల నిమిత్తం విడుదల చేసినట్లు వివరించారు. విడుదల అయిన నిధులతో 2024 మార్చి 31వ తేదిలోపు ఆయా పనులు పూర్తి చేయాలని అన్నారు. జిల్లా అధికారి వెంట స్థానిక రేంజ్ అధికారి సయ్యద్ మహబూబ్, ఎఫ్ఎస్ఓ బి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

'దిశ' యాప్ పై ప్రజలకు అవగాహన

ప్రజాశక్తి-సత్తెనపల్లి

మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు ,హత్యలు దాడుల నివారణ కోసం ప్రభుత్వం దిశా యాప్ తీసుకు వచ్చిన విషయం తెలిసిందే. ఈ యాప్ ను ప్రతి ఒక్కరూ తమ ఫోన్లలో డౌన్లోడ్ చేసుకోవాలని కోరింది. అందులో భాగంగా శుక్రవారం సత్తెనపల్లి పట్టణం లోని గుంటూరు-మాచర్ల ప్రధాన రహదారిపై పట్టణ పోలీస్ స్టేషన్ సమీపంలో, తాలూకా సెంటర్లో, పట్టణంలోని వివిధ కళాశాలల్లో పట్టణ పోలీసులుక్యాంప్ లు ఏర్పాటు చేశారు. కళాశాలలో విద్యార్థిని విద్యార్థులకు,గుంటూరు మాచర్ల ప్రధాన రహదారిపై రహదారిపై ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులను ఆటో లో ప్రయాణిస్తున్న ప్రయాణికులను ఆటోడ్రైవర్లను ఆపి దిశ యాప్ ను డౌన్లోడ్ చేయించారు. ఈ యాప్ ను ఎలా ఉపయోగించాలో వారికి పోలీసు సిబ్బంది వివరించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్సై రఘుపతి, పట్టణ పోలీసులు, మహిళా కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-అమరావతి

మండల పరిధిలో పోలీసులు దిశా యాప్ డౌన్లోడ్ పట్ల ప్రజలకు సీఐ వీరబ్రహ్మాం ఆధ్వర్యంలో ఎస్సై మహబూబ్ సుభాని నేతత్వంలో పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించారు. మండల కేంద్రమైన అమరావతిలోని శ్రీ అమరలింగేశ్వర దేవస్థానం ప్రధాన కూడళ్లలో, కళాశాలల్లో, ప్రతి ఒక్కరి చేత మొబైల్ ఫోన్లో దిశా యాప్ ను

డౌన్లోడ్ చేయించారు. అనంతరం పోలీ సులు మాట్లాడుతూ.. దిశా యాప్ ఆపద సమయాల్లో ప్రతి ఒక్కరికి బాసటగా నిలుస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా దిశ యాప్ ను డౌన్లోడ్ చేసుకోవాలని పోలీస్ లు ప్రజలకు సూచించారు.

జర్నలిస్టుల ఇళ్ళ స్థలాల జిఒలో సవరణకు వినతి

ప్రజాశక్తి-మాచర్ల



ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు కేటాయించే నిమిత్త విడుదల చేసిన జిఒలో వర్కింగ్ జర్నలిస్టులందరికి మేలు జరిగేలా తగిన సవరణల గురించి సిఎం జగన్‌మోహన్‌రెడ్డికి తెలియజేయాలని ఎపియు డబ్ల్యూజె నేతలు కోరారు. ఈ మేరకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామక్రిష్ణారెడ్డికి శుక్రవారం వినతిపత్రం అంద జేశారు.

కార్పొరేటర్లతో కమిషనర్ సమావేశం

కమిషనర్‌కు పూల బొకే అందచేస్తున్న నాయకులు

నగర కమిషనర్‌ను కలిసిన ఎపిజిఇఎ నాయకులు

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కొత్తగా ఎన్నికైన జిల్లా మహిళా విభాగం నాయకులు శుక్రవారం గుంటూరు నగర కమిషనర్ కీర్తి చేకూరిని మర్యాదపూర్వకంగా కలిశారు. జిఎంసి పరిధిలో సస్పెన్షన్‌కు గురైన వార్డు సచివాలయ ఉద్యోగుల్ని తిరిగి విధులలోకి తీసుకోవాలని కోరారు. వారికి సంబంధించిన ఎంక్వయిరీ పెండింగ్‌లో ఉంచి, విధుల్లో తీసుకునే విధంగా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఇటీవల విదేశీ పర్యటన విజయవంతంగా ముగించుకున్న కమిషనర్‌కు మహిళా నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిజిఇఎ జిల్లా అధ్యక్షులు చాంద్‌బాషా, జిల్లా సంయుక్త కార్యదర్శి కోట సాహెబ్ , నగరశాఖ సంయుక్త కార్యదర్శి ఎల్.భరత్ కుమార్, గుంటూరు జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు ఎల్. పద్మావతి, మహిళా విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి సుమిత్రాదేవి, జిల్లా కోశాధికారి టి.శేషుకుమారి, జిల్లా ఉపాధ్యక్షురాలు లలితకుమారి, సంధ్యా రాణి, జిల్లా సంయుక్త కార్యదర్శి రమణి, అనిత తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు ఛానల్ పనులకు నిధులు కేటాయించాలని

20న నిరసన దీక్ష

ప్రజాశక్తి- పెదనందిపాడు రూరల్

గుంటూరు ఛానల్ పర్చూరు వరకు పొడిగించే విషయం జాప్యం లేకుండాలేకుండా వెంటనే నిధులు కేటాయించాలని కోరుతూ ఈనెల 20వ తేదీ పెదనందిపాడు లో రైతు సంఘాల ఆధ్వర్యంలోఏర్పాటు చేస్తున్న నిరసన దీక్ష కార్యక్రమంలో రైతులందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నల్లమడ రైతు సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లా రాజమోహనరావు పిలుపునిచ్చారు. గత వారం రోజుల నుండి పర్చూరు కాకుమాను పెదనందిపాడు పత్తిపాడు మండలాల గ్రామాల లో వారు పలువురు రైతు సంఘం నాయకులతో కలిసి విస్తతంగా పర్యటిస్తు రైతులతో కలిసి చర్చలు జరుపుతున్నారు శుక్రవారం మండలంలోని గోగులమూడి రావిపాడు పత్తిపాడు మండలంలోని మేడవారిపాలెం గ్రామాల్లో వారు పర్యటించారు వారి వెంట నల్లమడ రైతు సంఘం కార్యదర్శి అంకమ్మ చౌదరి. ఈదర భ్రమరాంబ. లావుచౌదేశ్వరీ. కొల్లా రామన్ ఉన్నారు.

మురుగు నీరు నివారణకు చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని అపార్టుమెంట్ల నుంచి వస్తున్న మురుగునీరు పంట కాలువల్లోకలవడం పట్ల గుంటూరు జిల్లా తెలుగు రైతు సంఘం నాయకులు కళ్లం రాజశేఖరరెడ్డి, అక్కినేని సుబ్రహ్మణ్యం ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం తాడేపల్లిలో ఆంధ్ర రత్న పంపింగ్ స్కీమ్‌ను వారు పరిశీలించారు. ముఖ్యంగా అపార్టుమెంట్ల నుంచి వస్తున్న వ్యర్థ నీరు పంట పొలాల్లోకి వచ్చి చేరుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యేతో పాటు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

తెలుగు పద్యాల పోటీలు

ప్రజాశక్తి-తాడేపల్లి :జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం తాడేపల్లి శాఖ గ్రంథాలయంలో తెలుగు పద్యాల పోటీలు సబ్‌జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగంలో నిర్వహించారు. అరవింద హైస్కూల్, జిల్లా పరిషత్ హైస్కూల్, భగవాన్ ప్రైవేటు స్కూల్, జిల్లా పరిషత్ ఎలిమెంటరీ హైస్కూల్, రవీంద్రభారతి స్కూలు విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఎస్‌కె నాగూర్‌బాష ఉపాధ్యాయులు బి.లక్ష్మీ పద్మావతి, రాధిక, విజ్జులత, సిహెచ్.రమేష్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-గుంటూరు

కార్పొరేటర్ల నుండి అందే ఫిర్యాదులు, ఆర్జీల పరిష్కారంపై వార్డుల వారీగా నివేదిక ఇవ్వాలని విభాగాదిపతులకు నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. శుక్రవారం కమిషనర్ ఛాంబర్‌లో నగరంలోని కార్పొరేటర్లతో వార్డుల్లో అభివద్ధి పనులు, స్థానిక సమస్యల పై ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రజా ప్రతినిధులు ప్రజలతో మమేకమై ఉంటారని, వారు గుర్తించిన సమస్యలను వెంటనే పరిష్కారనికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

కాంట్రాక్టర్లకు ప్రత్యేక గ్రీవెన్స్

నగరంలో టెండర్ పొందిన కాంట్రాక్టర్లు అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా, నాణ్యతా ప్రమణాలు పాటిస్తూ పూర్తి చేయాలని, కాంట్రాక్టర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ కీర్తిచేకూరి తెలిపారు. శుక్రవారం కమిషనర్ ఛాంబర్‌లో జిఎంసి కాంట్రాక్టర్లతో కమిషనర్ స్పెషల్ గ్రీవెన్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో అభివద్ధి పనులు నిర్వహించే కాంట్రాక్టర్ల సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతి శుక్రవారం ప్రత్యేకంగా గ్రీవెన్స్ నిర్వహించారు. గ్రీవెన్స్‌లో కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలను తమ దృష్టికి తెచ్చారు.

కమిషనర్‌తో మాట్లాడుతున్న కార్పొరేటర్లు

విద్యార్థులకు ప్రేరణ తరగతులు

ప్రజాశక్తి మంగళగిరి : మంగళగిరి పట్టణంలో గల నిర్మల జూనియర్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు ప్రేరణ తరగతి క్లాసు జరిగింది. ఈ సందర్భంగా పాలమూరు యూనివర్సిటీ సీనియర్ ఆచార్యులు డాక్టర్ రాధాకృష్ణారావు మాట్లాడుతూ రానున్న కాలంలో విద్యార్థులు ఎదుర్కొనే అనేక సమస్యలకు పరిష్కారాలను ఆయన వివరించారు. రానున్న కాలంలో ఎన్నో అవకాశాలు ఉన్నాయని వాటిని అందిపుచ్చుకునే విధంగా విద్యార్థులు ఎదగాలని కోరారు. పరీక్షలను పండగ

వాతావరణంలా చూసి చదివి మంచి ఉత్తీర్ణత సాధించాలని కోరారు. సమయపాలన పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిర్మల జూనియర్ కళాశాల డైరెక్టర్ వివి ప్రసాద్ తదితదరులు పాల్గొన్నారు.

బాలోత్సవాల బ్రోచర్ పంపిణీ

ప్రజాశక్తి-తాడేపల్లి

డిసెంబర్ 19, 20 తేదీల్లో మంగళగిరి సమీపంలోని డాన్‌బాస్కో హైస్కూల్లో జరుగుతున్న మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం బ్రోచర్లను శుక్రవారం తాడేపల్లి పట్టణంలోని దక్షిణం వైపు ఉన్న పాఠశాలలన్నీ పూర్తి చేశారు. దుగ్గిరాల మండలంలోని పాఠశాలలతో పాటు మంగళగిరి రూరల్ గ్రామాలైన నూతక్కి, రేవేంద్రపాడు గ్రామాల్లో బ్రోచర్ల పంపిణీ చేశారు. ఆయా పాటశాలల నుంచి స్పందన లభించింది. అందరికీ అందుబాటులో జరుగుతున్న బాలోత్సవం కార్యక్రమానికి తమ పాఠశాలల నుంచి వివిధ ఈవెంట్లలో పాల్గొనే విద్యార్థుల జాబితా అందజేస్తామని ఉపాధ్యా యులు తెలిపారు. రాజధాని గ్రామాలైన నీరుకొండ, కురగల్లు, నిడమర్రు గ్రామాల్లో బ్రోచర్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. మొత్తం 200 పాఠశాలలకు మంగళగిరి, తాడేపల్లి, రాజదాని, దుగ్గిరాల మండలాలకు సంబంధించి బ్రోచర్లు అందజేయడం జరుగుతుందని బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో గాదె సుబ్బారెడ్డి, బిట్రా రామారావు, రాజు మాస్టార్, జ్యోతిపాల్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే యాత్ర

ప్రజాశక్తి-తాడేపల్లి

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ల దాటినా సమాజంలో ఉన్న సమస్యలు కోకొల్లలుగా ఉన్నాయని వాటి పరిష్కారం కోసమే ఐక్యత విజయపథం యాత్ర నిర్వహించినట్లు విశ్రాంత ఐఎఎస్ అధికారి విజయ్‌కుమార్ తెలిపారు. జులై 23 తడ నుండి ప్రారంభమైన యాత్ర నేడు 1500 కిలోమీటర్లు మైలురాయి దాటి తాడేపల్లి చేరుకుందని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పేదలకు అవసరమైన కూడు, గూడు, గుడ్డ నేటికీ తీరని అవసరాలుగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి పేదల సమస్యలపై అధ్యయనం చేసి పోరాటాల ద్వారానే పరిష్కారాలు కనుగొనగలమని చెప్పారు. ఈ యాత్ర రాజకీయాలతో సంబంధంలేదని, తన వ్యక్తిగత యాత్రగా భావించాలని కోరారు. ముఖ్యంగా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకే ఈ యాత్ర చేపట్టినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

బిజెపిని నమ్మలేం : కేసన

ప్రజాశక్తి మంగళగిరి

బీసీల అభ్యున్నతి కోసం ఉన్న అవకాశాలు, ప్రయోజనాలను కేంద్ర ప్రభుత్వమే అడ్డుకుని అణగదొక్కుతుందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. మంగళగిరి కార్యాలయంలో గుంటూరు జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్ అధ్యక్షతన ముఖ్య నాయకులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పది సంవత్సరాలు అధికారంలో కొనసాగిన ప్రభుత్వం, బిసి వ్యక్తి ప్రధాన అయి ఉండి బీసీ వర్గాల అభ్యున్నతికి ఏం సహకరించారో చెప్పాలని ప్రశ్నించారు. కనీసం కులగణన చేయాలని ఏడు దశాబ్దాలు నుంచి బీసీ సంఘాలు పోరాడుతుంటే గత ఎన్నికల ముందు 2018లో రాజనాథ్ సింగ్ కులగణనకు అనుకూలంగా చేసిన ప్రకటన కార్యాచరణకు నోచుకోలేదన్నారు. బీసీలకు హక్కులు కల్పించి అమలు చేయడం భాజపా ప్రభుత్వానికి ఇష్టం లేదాని సూటిగా ప్రశ్నించారు. కులం తరతరాల సామాజిక పరిస్థితి అని చెప్పే భాజపా ప్రభుత్వం ఈ విషయంలో ఎందుకు భయపడుతుందో బీసీలు ఆలోచించే పరిస్థితిలో ఉన్నారన్నారు. అందుకే బీజేపీ పాలనను బీసీలు అనుమానిస్తున్నారన్నారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా అధ్యక్షులు పారేపల్లిమహేష్, జిల్లా కో-ఆర్డినేటర్ కాగితాల స్వాతి గౌడ్ ,నియోజకవర్గం అధ్యక్షులు ఉడత శ్రీనివాస్ యువజన అధ్యక్షులు ఆలా శివాజీ ,మంగళగిరి పట్టణ అధ్యక్షులు సత్యనారాయణ నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ ధనుంజయ్, నియోజకవర్గ జాయింట్ సెక్రెటరీ తిరువీధుల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అంజిరెడ్డికి పలువురు నివాళి

ప్రజాశక్తి-తాడేపల్లి :తాడేపల్లి ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ నిర్మాత మేకా అమరారెడ్డి అనుచరుడు బుర్రముక్కు అంజిరెడ్డి శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందారు. కమ్యూనిస్టు పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే అంజిరెడ్డి పార్టీలో చీలికల అనంతరం సిపిఎం వైపు గట్టిగా నిలబడ్డారు. తుదిశ్వాస వరకు సిపిఎం అభిమానిగానే కొనసాగారు. అంజిరెడ్డి మృతికి సిపిఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు, నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, బూరుగ వెంకటేశ్వర్లు, శ్రీనివాస కుమారి, గాదె సుబ్బారెడ్డి, బి.లక్ష్మి, ఎం.శ్రీనివాసరెడ్డి, డి.దశరథరామిరెడ్డి, గోపాల్‌రెడ్డి, డి.యోహాన్, కె.వెంకటయ్య, ఎం.సుబ్బారావు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

సహకార రంగ అభివృద్ధికి ప్రభుత్వం కృషి

డివిజినల్ సహకార శాఖాధికారి రత్నావతి

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయంలో శుక్రవారం 76వ అఖిలభారత సహకార శాఖ వారోత్సవాలు జరిగాయి. ముఖ్య అతిథిగా గుంటూరు డివిజినల్ సహకారశాఖ అధికారి యు రత్నావతి హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యాలయంలో ఆవరణలో ఏర్పాటుచేసిన సహకార జెండాను ఆమె ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభకు సంఘం అధ్యక్షులు ఆర్ల బ్రహ్మయ్య యాదవ్ అధ్యక్షత వహించారు. సభను ఉద్దేశించి రత్నావతి మాట్లాడుతూ పండిట్ జవహర్లాల్ నెహ్రూ జయంతిని ప్రతి ఏడాది నవంబర్ 14 నుంచి 20వ తేదీ వరకు అఖిలభారత సహకార వారోత్సవాలుగా జరుపుకుంటున్నామన్నారు. ప్రభుత్వం సహకార రంగాన్ని అభివృద్ధి పరచాలని అనేక పథకాలను చేపట్టి వాటిని కో-ఆపరేటివ్ సొసైటీల ద్వారా ప్రజల్లోకి తీసుకువెళ్లి వారికి లబ్ధి చేకూర్చాలని సహకార సంఘాలను ప్రారంభించడం జరిగిందన్నారు. జన ఔషధీ కేంద్రాలను కూడా సహకార సంఘాల ద్వారా ఏర్పాటు చేయాలని తలపెట్టడం జరిగిందని, దానిలో భాగంగా జిల్లాలో ఐదు సొసైటీలను పైలట్ ప్రాజెక్టుగా తీసుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మండల కో-ఆపరేటివ్ సబ్ రిజిస్ట్రార్ బి ఉమాదేవి, సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొవ్వా వెంకటేశ్వరరావు, సంఘం చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రాయల రమేష్ బాబు, సంఘం డైరెక్టర్లు సుంకర సుబ్బారావు, కర్రి మరియదాసు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను నిరోధించాలి

ప్రజాశక్తి - మంగళగిరి

మనుషుల అక్రమ రవాణాలను అరికట్టడం అందరి బాధ్యత అని ప్రజ్వల సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ బలరామ కృష్ణ, సీకే జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ ఏ రత్నబాబు అన్నారు. సి.కే హై స్కూల్, జూనియర్ కాలేజీలో శుక్రవారం మనుషుల అక్రమ రవాణా పై ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ప్రజ్వల కోఆర్డినేటర్ సురేష్ కుమార్, అసిస్టెంట్ కోఆర్డినేటర్ శివ,కళాశాల మరియు పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మండలానికి మంచి పేరు తీసుకురావాలి

ఇన్‌ఛార్జి ఎంపిడిఒ వీరయ్య

ప్రజాశక్తి -దుగ్గిరాల

ఆటల పోటీల్లో యువత చురుగ్గా పాల్గొని మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఇన్చార్జ్ ఎంపీడీవో డి వీరయ్య కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలు నిర్వహణకు వివిధ శాఖల అధికారులు గ్రామ కార్యదర్శులు సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పి ఈ టి లతో శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయ పరిధిలో ఈ ఆటలు పోటీలు నిర్వహిస్తామని మండలంలో 17 గ్రామాల్లో నిర్వహించ నున్నట్లు తెలిపారు. డిసెంబర్ 15 నుండి 20వ తేదీ వరకు ఐదు రోజులు గ్రామస్థాయిలో 21 నుండి జనవరి 4వ తేదీ వరకు మండల స్థాయిలో ఈ ఆటల పోటీలు జరుగుతాయని పోటీల్లో నెగ్గిన వారిని నియోజకవర్గస్థాయి జిల్లాస్థాయి ఆ తర్వాత రాష్ట్ర స్థాయిలో పోటీలు నిర్వహిస్తార న్నారు. 15 సంవత్సరాలు పైబడిన వారందరూ ఈ పోటీల్లో పాల్గొనవచ్చునని తెలిపారు. గ్రామ వాలంటీర్లు ఇంటింటికి తిరిగి పేరు నమోదు చేసుకుంటారని వారితో సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తహసిల్దార్ కే మల్లేశ్వరి పంచాయతీరాజ్ ఏఈ రమేష్ రెడ్డి ఈ ఓ పి ఆర్ డి శ్రీనివాస రావు ఎంఈఓ కే లక్ష్మీనారాయణ ఏఎస్ఐ అబ్దుల్ సత్తార్ పాల్గొన్నారు.



హ్యాకథాన్‌పై మలినేనిలో సెమినార్

ప్రజాశక్తి-గుంటూరు

మలినేని లక్ష్మయ్య ఉమెన్స్ ఇంజినీరింగ్ కాలేజిలో స్మార్ట్ హ్యాకథాన్‌పై శుక్రవారం ఒక రోజు సెమినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రవాసాంధ్రులు, మైక్రోసాఫ్ట్ ప్రోగ్రామ్ మేనేజర్ లింగినేని రవితేజ పాల్గొన్నారు. మలినేని విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఎం.పెరుమాళ్లు మాట్లాడుతూ హ్యాకథాన్ పలుమార్లు నిర్వహించటం వల్ల విద్యార్థినులలో ఐడియాలజి అభివృద్ధి, ఆధునిక టెక్నాలజీపై అవగాహన పెరుగుతుందని వివరించారు. ఉన్నత విద్య, ఉపాధి కోసం విదేశాలకు వెళ్లినప్పుడు వారి ప్రతిభను నిరూపించుకోవచ్చన్నారు. రవితేజ మాట్లాడుతూ హ్యాకథాన్ ఆవశ్యకత, ఈ హ్యాకథాన్‌లో వచ్చే ఐడియాలను ఎలా అభివృద్ధి చేయాలి, ఉత్తమ ఐడియాలజీలను ప్రోత్సహించటానికి ఏయే కంపెనీలు పెట్టుబడులు పెడతాయి అనే అంశాలు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జె.అప్పారావు, డీన్ పి.రమేష్‌బాబు, సిఎస్ఇ హెడ్ రామస్వామి పాల్గొన్నారు.

కుల గణనను విజయవంతంగా పూర్తి చేయాలి

- ప్రజల్లో అపోహలను తొలగించండి
- అధికారులతో పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ సమీక్ష

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 27 నుండి వచ్చే నెల 3 వరకు నర్వహించనున్న కులగణన కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని అధికారులను పల్నాడు జిల్లా కలెక్టర్ ఆదేశించారు. నరసరావుపేట పట్టణం ప్రకాష్‌నగర్‌లోని భువనచంద్ర టౌన్ హాలులో జిల్లా అధికారులు, డివిజన్, మండల స్థాయి మరియు మండల ప్రత్యేక అధికారులతో ఆంధ్రప్రదేశ్ కుల గణన 2023 పై జిల్లా స్థాయి వర్క్‌షాపును శుక్రవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కుల గణనపై ప్రజలలో అపోహలను తొలగించి అవగాహన కల్పించాలన్నారు. కుల గణన వల్ల ప్రభుత్వ పథకాలు అందవన్న ఆపోహలు వద్దన్నారు. సచివాలయంలోని ఫంక్షనల్ అసిస్టెంట్‌ల సేవలను వినియోగించు కోవలన్నారు. బూత్ లెవెల్ ఆఫీసర్లను ఈ ప్రక్రియలో భాగస్వామ్యం కానివ్వొద్దని చెప్పారు. ఈ నెల 25వ తేదీలోగా వాలంటీర్లు ఇంటి ఇంటి సర్వే చేసి కుల గణన వివరాలు తెలిపి అవగాహన కల్పించాలన్నారు. మాస్టర్ ట్రైనర్‌గా శిక్షణ పొందిన సత్తెనపల్లి మున్సిపల్ కమిషనర్ షమ్మి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అధికారులకు వివరించారు. సూపర్ వైజర్‌లు విధిగా 200 ఇళ్లను సర్వే చేయాలని, సంక్షేమ శాఖలు తమ వంతు సహకారాన్ని అందించాలని చెప్పారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇప్పటంలో కేంద్ర బృందం పర్యటన

జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణంపై పరిశీలన

నివాసితులతో మాట్లాడుతున్న కేంద్ర బృందం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఎమ్‌టిఎమ్‌సి (మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్) పరిధిలోని ఇప్పటంలో రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన సెంటున్నర స్థలాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో పేదలు నిర్మించుకున్న ఇళ్లను కేంద్ర గృహనిర్మాణ శాఖ రీజనల్ కో-ఆర్డినేటర్ సునీల్ ఫరూక్, ఇతర బృంద సభ్యులు శుక్రవారం పరిశీలించారు. ఇప్పటంలో మొత్తం 35 మందికి ఇళ్ల స్థలాలను కేటాయించగా 28 మంది ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఆ ఇళ్లల్లోని మహిళలతో సునీల్ ఫరూక్ చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంత ఇల్లు లేనివారికి ఇళ్ల నిర్మించాలనే ఉద్దేశ్యంతో ప్రధానమంత్రి ఆవాస యోజన పథకం ఏర్పాటు చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దేశవ్యాప్తంగా ఇళ్ల నిర్మాణం చేపట్టాయని చెప్పారు. ఆంధ్రప్రదేశ్లో జగనన్న కాలనీలో ఏర్పాటు చేసిన ఇళ్లు చాలా అందంగా ఉన్నాయని అన్నారు. ఇంటి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.1.75 లక్షలు, అందిస్తే రాష్ట్ర ప్రభుత్వం ఇంటి స్థలాన్ని ఇవ్వడంతో పాటు మౌలిక సదుపాయాలైన విద్యుత్, రోడ్లు, తాగునీటి సౌకర్యాలు కల్పిస్తోందని అన్నారు. అయితే ఏపీ రాష్ట్ర ప్రభుత్వం రూ.30 వేలతో పాటు, వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకునేందుకు రూ.12 వేలు, డ్వాక్రా సంఘాల నుండి మరికొంత నగదు అందజేస్తోందని అన్నారు. రాష్ట్రంలో నిర్మిస్తున్న ఇళ్లు బాగున్నాయని కితాబిచ్చారు. కార్యక్రమంలో అధికారులు మనీష్, నాగభూషణం, టి.వేణుగోపాలరావు, వెంకటరెడ్డి, భాస్కర్, రామమోహనరావు, పంచాయితీ సెక్రటరి ప్రసాద్, వైసిపి మండల అధ్యక్షులు ఎం.వివేకానందరెడ్డి, తులసీదాస్ పాల్గొన్నారు.

స్టెమ్ స్కూల్‌లో బుక్ ఫెస్టివల్ ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక స్టెమ్ పాఠశాలలో శుక్రవారం 56వ జాయతీ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా మూడవ బుక్‌ఫెస్టివల్ నిర్వహించారు. ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా ఢిల్లీ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ చుక్కపల్లి ప్రియాంక, నెక్స్ట్‌జెన్ స్కూల్ డైరెక్టర్ డాక్టర్ కె.శ్రీవిద్య హాజరయ్యారు. స్టెమ్ స్కూల్ కరస్పాండెంట్ భరత్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్‌కు పుస్తక పఠనం ఎంతో తోడ్పడుతుందని, మేథావుల జీవితాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ పుస్తక పఠనాన్ని జీవితంలో భాగంగా మార్చుకోవాలన్నారు. ఈనెల 19 వరకూ పుస్తక ప్రదర్శన అందుబాటులో ఉంటుందని, ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు.

అథ్లెటిక్స్‌లో స్టెమ్ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన అథ్లెటిక్ మీట్‌లో రన్నింగ్, లాంగ్‌జంప్ విభాగాల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారని స్టెమ్ పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ భరత్‌రెడ్డి తెలిపారు. లాంగ్‌జంప్‌లో ఆర్.తేజస్విని రెండో స్థానంలో, రన్నింగ్‌లో ఎం.లోహిత వందమీటర్లు, 60 మీటర్ల పరుగులో రెండో స్థానంలో నిలిచారన్నారు. వి.గీత ఐశ్వర్య వంద మీటర్ల విభాగంలో మూడో స్థానంలో నిలిచినట్లు చెప్పారు. వీరిని భరత్‌రెడ్డితోపాటు ప్రిన్సిపాల్ జయశీలి, ఉపాధ్యాయులు అభినందించారు.

స్వచ్ఛ ఓటర్ల జాబితాకు ఇదే చివరి అవకాశం

ప్రజాశక్తి-గుంటూరు

అర్హులైన ఏ ఒక్కరి ఓటునూ తొలగించడానికి వీల్లేదని, తొలగింపు ఆర్జీలను సూపర్వైజరి, ఏఈఆర్‌ఓలు ప్రత్యక్షంగా పరిశీలన చేస్తారని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్‌ఓ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. శుక్రవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఎన్నికల విభాగ విధుల నిర్వహణపై ఏఈఆర్‌ఓలు, సూపర్వైజరి అధికారులతో సమీక్షించారు. కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు అర్హులైన ఏ ఒక్కరి ఓటు తొలగించబడదని, అలా ఎక్కడైనా జరిగితే పీపుల్స్ రిప్రజంటేటివ్ యాక్ట్ 1950 ప్రకారం జిల్లా ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేయవచ్చని అన్నారు. కొత్తగా ఓటు కోసం ఫారం-6ని దాఖలు చేయవచ్చని తెలిపారు. ఓటర్ల ముసాయిదా జాబితా ప్రకారం బిఎల్‌ఓల క్షేత్ర స్థాయి పరిశీలనలో జాడ లేని ఓటర్లకు నిబంధనల మేరకు రిజిస్టర్ పోస్ట్ చేశామని, 15 రోజుల్లో నిర్దేశిత ఓటర్ల నుండి తగిన వివరణ రాకుంటే ఏఈఆర్‌ఓల పర్యవేక్షణలో వారి ఓటు తొలగిస్తామని తెలిపారు. స్వచ్ఛ ఓటర్ల జాబితా తయారికి ఇదే చివరి అవకాశమని, బిఎల్‌ఓలు మరింత అప్రమత్తంగా తమ పరిధిలోని ఓటర్ల లిస్టు సరిచేయాలని చెప్పారు. రాజకీయ పార్టీల నుండి, ప్రజల నుండి అందిన ఫారాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ ద్వారా పరిష్కరించాలన్నారు.

20వ తేదీ నుండి 'ఆడుదాం ఆంధ్ర' రిజిస్ట్రేషన్

- ఆన్‌లైన్‌లోనే నమోదు చేసుకోవచ్చు
- సచివాలయ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకూ పోటీలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వచ్చే నెల 15 నుండి జనవరి 26 వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమంలో పల్నాడు జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించేలా కృషి చేయాలని ఫిజికల్ డైరెక్టర్లు, పిఇటిలను జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ కోరారు. దీనిపై నరసరావుపేట పట్టణంలోని భువనచంద్ర టౌన్‌హాలులో జిల్లా అధికారులు, పీడీలు, పిఇటిలు, మండల అధికారులతో కలెక్టర్ శుక్రవారం సమీక్షించారు. 15 ఏళ్లు నిండిన యువత ఈనెల 20 నుండి ఆన్లైన్లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. జిల్లాలో 229 మైదానాలను గుర్తించామని, మండలానికి ఒక ఫిజికల్ డైరెక్టర్‌ను మండల కో-ఆర్డినేటర్‌గా నియమించామని తెలిపారు. క్రీడా సామగ్రి ఈ నెల 21 నుండి సరఫరా చేస్తామన్నారు. డిసెంబర్ 15వ తేదీ నుండి 20వ తేదీ వరకు సచివాలయ స్థాయిలో, డిసెంబర్ 21 నుండి జనవరి 4వ తేదీ వరకు మండల స్థాయిలో, జనవరి 5 నుండి 10వ తేదీ వరకు నియోజకవర్గ స్థాయిలో, జనవరి 11వ తేదీ నుండి జనవరి 25వ తేదీ వరకు జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహిస్తారని, రాష్ట్ర స్థాయిలో జనవరి 22వ తేదీ నుండి జనవరి 26వ తేదీ వరకు పోటీలు ఉంటాయని వివరించారు. అన్ని స్థాయిల్లోనూ విజేతలకు బహుమతులు ఉంటాయన్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతిగా రూ.5 లక్షలు, ద్వితీయ బహుమతిగా రూ.3 లక్షలు, తృతీయ బహుమతిగా రూ.2 లక్షలు అందిస్తారన్నారు. నియోజకవర్గ, మండల స్థాయిలో ప్రతిభ చాటిన క్రీడాకారులకు సైతం బహుమతులు ఉంటాయన్నారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ క్రీడాంశాల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. ఎక్కువమంది యువత పోటీల్లో పాల్గొనేలా చూడాలన్నారు. సచివాలయ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో నిర్వహించే క్రీడా పోటీల్లో ప్రజా ప్రతినిధులు పాల్గొనేలా చూడాలన్నారు. కార్యక్రమములో జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, స్టెప్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి పల్లవి, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

చిప్స్‌లో అంతర్జాతీయ సదస్సు ప్రారంభం

సదస్సులో పాల్గొన్న అతిథులు, కళాశాల ప్రిన్సిపాల్

ప్రజాశక్తి-గుంటూరు

చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కాలేజిలో 'క్వాలిటీ బై డిజైన్ ఏ రోడ్‌మ్యాప్ ఫర్ క్వాలిటీ ఫార్మాసూటికల్ ప్రొడక్ట్స్' అనే అంశంపై రెండ్రోజుల అంతర్జాతీయ శుక్రవారం ప్రారంభమైంది. ఓపెరెంట్ ఫార్మసీ ఫెడరేషన్, ఇండియన్ ఫార్మాసూటికల్ అసోసియేషన్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఈ సదస్సు ఏర్పాటు చేశారు. కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అధ్యక్షత వహించిన మొదటిరోజు సదస్సులో ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కార్యనిర్వాహక సభ్యులు డాక్టర్ ఎం.వెంకటరమణ, ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.విలియం క్యారి ముఖ్యవక్తలుగా పాల్గొన్నారు. ఫార్మా రంగంలో సుశిక్షితులైన దేశ, విదేశీ నిపుణులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ విద్యాధర తెలిపారు. దేశ, విదేశాల నుండి 650 మంది హాజరు కాగా దాదాపు 250 మంది వారి పరిశోధనా పత్రాలు సమర్పించినట్లు చెప్పారు. డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ ప్రస్తుత ఫార్మా రంగంలో ఔషధ అభివృద్ధి ప్రతి దశలోనూ ఉత్పత్తి నాణ్యత, సమర్థత, ఆవిష్కరణలను నిర్ధారించటానికి డిజైన్ ద్వారా నాణ్యత అనేది ఒక ముఖ్యమైన ప్రక్రియగా మారిందన్నారు. విలియం క్యారీ మాట్లాడుతూ విద్యార్థులు ఆచరణాత్మక నైపుణ్యాలు, ఫార్మా రంగంలోలోని తాజా పోకడలపై జ్ఞానాన్ని అందులో ఎదురయ్యే సవాళ్లను ఏకకాలంలో తెలుసుకునే అవకాశం, ఔషధ తయారీ ప్రక్రియలో రూపకల్పన ద్వారా నాణ్యత అనే అంశంపై శిక్షణ పొందటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రెటరీ డాక్టర్ డాక్టర్ సి.ఎస్.శ్రీనివాస్, కోశాధికారి రాయపాటి గోపాలకృష్ణ ప్రసంగించారు.